www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1 వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం


నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 59 | | 8-8-2026 | | శనివారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |

## అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం



- కీలక నిర్ణయం దిశగా ట్రంప్ ముందడుగు

4

## అమిత్‌షాతో రాజీనామా చేయించండి

- మోహన్ భాగవత్‌కు కేసీ వేణుగోపాల్ సవాల్
- జెన్‌జీపై ప్రేమ మాటల్లో కాదు.. చేతల్లో చూపాలి
- విద్యార్థులపై అణచివేతను ఎందుకు ఖండించలేదు?
- ప్రభుత్వాన్ని ఆరెస్సెస్ నియంత్రిస్తోందని ఆరోపణ



4

## ఆందోళన వద్దు.. మీకు నేనున్నా

### ఎన్డీఏ ఎంపీలకు మోదీ భరోసా

- కూటమిలో ప్రతి ఎంపీకి సమాన గౌరవం
- నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- నేరుగా ప్రధాని కార్యాలయాన్ని సంప్రదించండి
- పార్లమెంట్‌లో అంతరాయాలతో కొత్త ఎంపీలకు అవకాశం దక్కడం లేదని ఆవేదన



4




# జీఎస్టీ ఆదాయం పెంపునకు ఏఐ అస్త్రం

- పన్ను లీకేజీలకు సాంకేతికతతో చెక్
- శాఖల సమాచారం ఒకే వ్యవస్థలోకి
- వ్యాపారులకు ఇబ్బందులు లేకుండానే రాబడి పెంపు
- ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌తో సీఎం రేవంత్ విస్తృత చర్చలు

తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం కృత్రిమ మేధను ప్రధాన అస్త్రంగా వినియోగించనుంది. ముఖ్యంగా జీఎస్టీ, ఎక్సైజ్ ఆదాయాన్ని పెంచడంతో పాటు పన్నుల లీకేజీలను గుర్తించి అరికట్టేందుకు ఏఐ ఆధారిత సమీకృత వ్యవస్థను రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా, సులభతర వాణిజ్య విధానానికి ఆటంకం లేకుండానే ప్రభుత్వ ఆదాయం పెరిగేలా పటిష్ట ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఎంసీ ఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్, రాష్ట్ర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగుపరచడం, ఆదాయ వనరులను పెంచడం, పన్నుల వసూళ్లలో లోపాలను సరిదిద్దడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.

- హైదరాబాద్, ఆగస్టు 7

## హైదరాబాద్‌కు మరో మెగా బస్ టెర్మినల్



- గాజులరామారంలో 100 ఎకరాల్లో నిర్మాణం
- అంతర్రాష్ట్ర, సిటీ బస్సులకు వేర్వేరు టెర్మినల్లు
- ఎలక్ట్రిక్ బస్సులకు ప్రత్యేక ఛార్జింగ్ కేంద్రం
- నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించడమే లక్ష్యం
- లోక్‌సభలో వెల్లడించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ

హైదరాబాద్ నగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగర శివారులోని కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి భూమి కేటాయించినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లోక్‌సభలో అధికారికంగా వెల్లడించారు. ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

- న్యూఢిల్లీ, ఆగస్టు 7

2

## వానల కోసం 'వరుణ' యాగం



- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం
- 10న నాగార్జునసాగర్‌లో మహా క్రతువు
- 108 మంది రుత్విక్కులు.. 11 హోమకుండాలు
- పూర్ణాహుతిలో పాల్గొననున్న సీఎం రేవంత్

2

## సామూహిక లైంగికదాడి




- దృశ్యాలు చిత్రీకరించి బెదిరింపులు
- వీడియోలు బయటపెడతామంటూ బ్లాక్‌మెయిల్
- నలుగురు నిందితుల అరెస్టు.. రిమాండ్
- కారు, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

2

## నా భర్తను చంపు.. లేదంటే నేనే చనిపోతా!

- భార్య ఫోన్‌లో సందేశాలు చూసి భర్త షాక్
- ప్రియుడితో కలిసి హత్యకు కుట్ర పన్నిందని ఆరోపణ
- వెంటాడినట్లు ఫిర్యాదు..
- తప్పించుకుని ఇంటికి చేరిన భర్త
- డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్ నమోదు

2





## తెలంగాణ నీటి హక్కులను కాపాడాలి

- జీఆర్ఎంబీ అజెండాలోని మూడు అంశాలను ఉపసంహరించాలి
- కేంద్ర జలశక్తి మంత్రికి హరీశ్‌రావు లేఖ

3

## స్వాతంత్ర్య వేళ 'స్మార్ట్' రేషన్ కార్డులు

- 15న సంగారెడ్డిలో ప్రారంభించనున్న సీఎం
- రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కొత్త కార్డుల పంపిణీ
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

తెలంగాణలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనుంది. సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం వెల్లడించారు.

2






## అధికారులను కోర్టుకు పిలిపించడం బాధాకరం

- ప్రభుత్వాలు చేసిన తప్పులతోనే అధికారులకు ఈ పరిస్థితి
- ఉచిత పథకాలతో రాష్ట్ర ఖజానాపై తీవ్ర భారం
- సంపన్నులు, అధికారులు రైతుబంధు తీసుకోవడం బాధాకరం
- సందీప్ సుల్తానియా కేసు విచారణలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు

3




# వానల కోసం 'వరుణ' యాగం

## తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

## 10న నాగార్జునసాగర్‌లో మహా క్రతువు

## 108 మంది రుత్వికులు.. 11 హోమకుండాలు

## పూర్ణాహుతిలో పాల్గొననున్న సీఎం రేవంత్

**హైదరాబాద్, ఆగస్టు 7:** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి కృష్ణా, గోదావరి నదులు జలకళ సంతరించుకోవాలని, జలాశయాలు నిండాలని, పంటలు సమృద్ధిగా పండి రైతాంగం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ ప్రభుత్వం మహా వరుణ యాగం నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఆగస్టు 10న నాగార్జునసాగర్‌లోని విజయ విహార్ ప్రాంగణంలో ఈ యాగాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సారథ్యంలో జరిగే ఈ యాగం పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. ఎల్‌నినో ప్రభావం నుంచి రాష్ట్రానికి ఉపశమనం కలగడంతో పాటు కృష్ణా, గోదావరి నదుల్లో సమృద్ధిగా జలాలు ప్రవహించాలన్న ప్రత్యేక సంకల్పంతో ఈ మహా క్రతువును చేపట్టనున్నట్లు యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి తెలిపింది. రైతాంగ శ్రేయస్సు, రాష్ట్ర సుభిక్షాన్ని కాంక్షిస్తూ యాగాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

### 108 మంది రుత్వికులతో మహా క్రతువు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, అర్చకులతో పాటు మొత్తం 108 మంది రుత్వికులు వరుణ యాగంలో పాల్గొననున్నారు. ఇందుకోసం విజయ విహార్ ప్రాంగణంలో ప్రత్యేకంగా 11 హోమకుండాలను ఏర్పాటు చేయనున్నారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా యాగ క్రతువును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి సాగునీరు, తాగునీటికి ఇబ్బందులు లేకుండా ఉండాలని, పంటలు బాగా పండి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సంకల్పిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

### పూర్ణాహుతికి సీఎం రేవంత్

యాగం ముగింపు సందర్భంగా నిర్వహించే పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా పాల్గొననున్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు చేపడుతున్నారు. వేద పండితులు, అర్చకులు, రుత్వికులకు అవసరమైన ఏర్పాట్లతో పాటు యాగ ప్రాంగణంలో ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. కృష్ణా, గోదావరి నదులు జలకళతో కళకళలాడాలని, తెలంగాణ రైతాంగం సుభిక్షంగా ఉండాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే సంకల్పంతో వరుణ యాగాన్ని చేపడుతున్నట్లు యాదగిరిగుట్ట దేవస్థానం పాలక మండలి ప్రకటించింది.

# మహిళపై సామూహిక లైంగికదాడి

## దృశ్యాలు చిత్రీకరించి బెదిరింపులు

## వీడియోలు బయటపెడతామంటూ బ్లాక్‌మెయిల్

## నలుగురు నిందితుల అరెస్టు.. రిమాండ్

**జగిత్యాల, ఆగస్టు 7:** జగిత్యాల జిల్లాలో దారుణ ఘటన జరిగింది. మల్యాల మండలం నూకపల్లి శివారులోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీలో ఓ మహిళపై ఇద్దరు వ్యక్తులు సామూహిక లైంగికదాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. అంతకుముందు ఆమె వ్యక్తిగత దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి, వాటిని బయటపెడతామని బెదిరించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో ప్రధాన నిందితులతో పాటు వారికి సహకరించిన మరో ఇద్దరిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు మల్యాల సీఐ రాజ్‌కుమార్ వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 3న నిజామాబాద్‌కు చెందిన ఓ మహిళ నూకపల్లి శివారులోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీలో తనకు తెలిసిన వారి ఇంటికి వచ్చింది. ఆ సమయంలో మల్యాల మండలం రాజారం గ్రామానికి చెందిన శివరాత్రి నరేశ్, గుర్రం శ్రీకాంత్ అక్కడికి చేరుకున్నారు. మహిళ తనకు సన్నిహితుడైన వ్యక్తితో ఉన్న సమయంలో వారి వ్యక్తిగత దృశ్యాలను సెల్‌ఫోన్‌లో చిత్రీకరించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం ఆ వీడియోలను అడ్డుపెట్టుకుని మహిళను బెదిరించి నరేశ్, శ్రీకాంత్ ఆమెపై సామూహిక లైంగికదాడికి పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నదని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటన సమయంలో జగిత్యాల జిల్లా ధరూర్ గ్రామానికి చెందిన మారవేని మల్లేశ్, రాజారం గ్రామానికి చెందిన గుర్రం అంజయ్య నిందితులకు సహకరించినట్లు తెలిపారు. ఘటన అనంతరం నరేశ్, శ్రీకాంత్ బాధిత మహిళకు ఫోన్ చేసి తమ వద్ద ఉన్న వీడియోలను ఇతరులకు పంపిస్తామంటూ బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దీంతో బాధితురాలు గురువారం మల్యాల పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు ఉపయోగించిన ఇన్నోవా క్రిస్టా కారుతో పాటు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మొదటి నిందితుడు శివరాత్రి నరేశ్‌పై గతంలో 13 కేసులు, రెండో నిందితుడు గుర్రం శ్రీకాంత్‌పై తొమ్మిది కేసులు నమోదై ఉన్నాయని సీఐ తెలిపారు. వీరిద్దరిపై రౌడీషీట్లు కూడా ఉన్నట్లు వెల్లడించారు. మూడో నిందితుడు మారవేని మల్లేశ్‌పై రెండు, గుర్రం అంజయ్యపై ఒక పాత కేసు ఉన్నట్లు వివరించారు. మహిళలపై వేధింపులు, లైంగిక దాడులు, సామాజిక మాధ్యమాల ద్వారా బెదిరింపులకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రాజ్‌కుమార్ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రౌడీషీటర్లు, పాత నేరస్థుల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తామని తెలిపారు. మీడియా సమావేశంలో ఎస్సై సందీప్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జీఎస్టీ ఆదాయం పెంపునకు 'ఏఐ' అస్త్రం

- పన్ను లీకేజీలకు సాంకేతికతతో చెక్
- శాఖల సమాచారం ఒకే వ్యవస్థలోకి
- వ్యాపారులకు ఇబ్బందులు లేకుండానే రాబడి పెంపు
- ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్‌తో సీఎం రేవంత్ విస్తృత చర్చలు



**హైదరాబాద్, ఆగస్టు 7:** తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఖజానాకు ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం కృత్రిమ మేధను ప్రధాన అస్త్రంగా వినియోగించనుంది. ముఖ్యంగా జీఎస్టీ, ఎక్సైజ్ ఆదాయాన్ని పెంచడంతో పాటు పన్నుల లీకేజీలను గుర్తించి అరికట్టేందుకు ఏఐ ఆధారిత సమీకృత వ్యవస్థను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా, సులభతర వాణిజ్య విధానానికి ఆటంకం లేకుండానే ప్రభుత్వ ఆదాయం పెరిగేలా పటిష్ట ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ప్రముఖ ఆర్థికవేత్త అరవింద్ సుబ్రమణియన్, రాష్ట్ర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మరింత మెరుగుపరచడం, ఆదాయ వనరులను పెంచడం, పన్నుల వసూళ్లలో లోపాలను సరిదిద్దడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.

### జీఎస్టీ అధికారులకు ఏఐ సమాచారం

జీఎస్టీ, ఎక్సైజ్ శాఖల్లో చేపట్టాల్సిన సంస్కరణలపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. జీఎస్టీ అధికారులకు అవసరమైన సమాచారాన్ని ఏఐ ఆధారంగా సులభంగా అందించే ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. పన్ను ఎగవేత, ఆదాయ లీకేజీలను గుర్తించేందుకు సాంకేతికతను సమర్థంగా వినియోగించాలని అభిప్రాయపడ్డారు. అయితే ఈ ప్రక్రియలో వ్యాపారులకు అనవసరమైన తనిఖీలు, ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ఖజానాకు రాబడిని పెంచుతూనే సులభతర వాణిజ్య విధానాన్ని మరింత మెరుగుపరిచేలా సాంకేతికత వినియోగం ఉండాలని అరవింద్ సుబ్రమణియన్ సూచించారు.

### శాఖల మధ్య సమన్వయంతో లీకేజీలకు చెక్

పన్నుల లీకేజీలను అరికట్టడంలో వివిధ ప్రభుత్వ శాఖల మధ్య ఉన్న సమన్వయ లోపాలను తొలగించాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా భవన నిర్మాణాలు, నిర్మాణ సామగ్రికి సంబంధించిన పన్నుల విషయంలో మున్సిపల్, రెరా, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్థిక, వాణిజ్య పన్నుల శాఖల సమాచారాన్ని ఏఐ సాయంతో అనుసంధానం చేయాలని చెప్పారు. భారీ భవనాలు, కాంట్రాక్టు పనులకు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకునే దశలోనే వాటికి అవసరమయ్యే నిర్మాణ సామగ్రి వివరాలను నమోదు చేయాలని సూచించారు. దాని ఆధారంగా ఎంత పన్ను రావాల్సి ఉంటుందో ముందుగానే అంచనా వేసే వ్యవస్థను రూపొందించాలని చెప్పారు. వాస్తవ కొనుగోళ్లు, పన్ను చెల్లింపులతో ఈ సమాచారాన్ని సరిపోల్చడం ద్వారా ఆదాయ లీకేజీలను గుర్తించే అవకాశం ఉంటుందని సమావేశంలో చర్చించారు.

### ప్రభుత్వ డేటా అంతా అనుసంధానం

మీసేవ, ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయనిధికి సంబంధించిన సమాచారాన్ని కూడా అవసరమైన మేరకు సమీకృతం చేస్తే పరిపాలనలో మరింత ఉపయోగకరంగా ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వివిధ శాఖల వద్ద ఉన్న సమాచారాన్ని సాంకేతిక పరిజ్ఞానంతో అనుసంధానించడం ద్వారా ప్రభుత్వ పథకాల అమలు, ఆదాయ వసూళ్లు, పరిపాలనా నిర్ణయాల్లో మరింత కచ్చితత్వం సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, వాణిజ్య పన్నుల శాఖ కార్యదర్శి రఘునందన్ రావు, ఎక్సైజ్ కమిషనర్ సీహెచ్ హరికిరణ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌కు మరో మెగా బస్ టెర్మినల్

- గాజులరామారంలో 100 ఎకరాల్లో నిర్మాణం
- అంతర్రాష్ట్ర, సిటీ బస్సులకు వేర్వేరు టెర్మినళ్లు
- ఎలక్ట్రిక్ బస్సులకు ప్రత్యేక ఛార్జింగ్ కేంద్రం
- నగరంపై ట్రాఫిక్ ఒత్తిడి తగ్గించడమే లక్ష్యం
- లోక్‌సభలో వెల్లడించిన కేంద్రమంత్రి గడ్కరీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** హైదరాబాద్ మహానగరంలో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టే దిశగా మరో భారీ బస్ టెర్మినల్ అందుబాటులోకి రానుంది. నగర శివారులోని గాజులరామారంలో ఏకంగా 100 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణానికి ప్రభుత్వం భూమిని కేటాయించింది. ఈ విషయాన్ని కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ లోక్‌సభలో వెల్లడించారు. ఈ టెర్మినల్ పూర్తయితే ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సులు నగరం మధ్యలోకి ప్రవేశించాల్సిన అవసరం తగ్గి ట్రాఫిక్‌పై ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని భావిస్తున్నారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు గడ్కరీ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. జగద్గిరిగుట్ట సమీపంలో బస్ డిపో ఏర్పాటు కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గతంలో హెచ్‌ఎంటీకి చెందిన స్థలాన్ని 99 ఏళ్ల లీజుకు కోరినట్లు తెలిపారు. అయితే హెచ్‌ఎంటీ అధికారులు కేవలం 20 ఏళ్లకు మాత్రమే లీజుకు ఇచ్చేందుకు అంగీకరించారని, ఐదేళ్లకోసారి దానిని సమీక్షిస్తామని షరతు విధించినట్లు పేర్కొన్నారు. దీనికితోడు ఏటా 6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలనే నిబంధన ఉండటంతో ఆ ప్రతిపాదనను ఆర్టీసీ తిరస్కరించినట్లు గడ్కరీ వివరించారు. దీంతో తెలంగాణ ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారంలో హెచ్‌ఎంటీ భూములకు సమీపంలోనే 100 ఎకరాల స్థలాన్ని ఆర్టీసీకి కేటాయించినట్లు తెలిపారు.

### ఒకేచోట రెండు టెర్మినళ్లు

గాజులరామారంలో ప్రతిపాదించిన బస్ టెర్మినల్‌ను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయనున్నారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల కోసం ప్రత్యేకంగా అంతర్రాష్ట్ర బస్ టెర్మినల్ ఏర్పాటు చేయడంతో పాటు హైదరాబాద్ నగర బస్సుల కోసం మరో టెర్మినల్ నిర్మించనున్నారు. ప్రయాణికులకు అవసరమైన మౌలిక వసతులను కూడా సమకూర్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. పర్యావరణహిత ప్రజా రవాణాను ప్రోత్సహించేందుకు ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. భవిష్యత్తులో విద్యుత్ బస్సుల సంఖ్య భారీగా పెరిగే అవకాశాన్ని దృష్టిలో పెట్టుకుని అందుకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించనున్నారు.

### నగరంలోకి రాకుండానే బస్సులు

కొత్త టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే పలు బస్సులు హైదరాబాద్ నగరం నడిబొడ్డుకు వెళ్లాల్సిన అవసరం లేకుండా గాజులరామారం నుంచే రాకపోకలు సాగించే అవకాశం ఏర్పడుతుంది. దీంతో మహాత్మాగాంధీ బస్‌స్టేషన్, జూబ్లీ బస్‌స్టేషన్‌తో పాటు ప్రధాన రహదారులపై వాహనాల ఒత్తిడి తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు రోజూ 404 ట్రిప్పులు నడుపుతున్నాయని గడ్కరీ తెలిపారు. కొత్త డిపో, టెర్మినల్ అందుబాటులోకి వస్తే ఈ ప్రాంతంలో ప్రజా రవాణా సదుపాయాలు మరింత విస్తరించనున్నాయి. వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ అవసరాలకు అనుగుణంగా నగర శివార్లలో ప్రజా రవాణా కేంద్రాలను అభివృద్ధి చేయడం ద్వారా నగరంలోకి వచ్చే బస్సుల సంఖ్యను తగ్గించడంతో పాటు ట్రాఫిక్ సమస్యను నియంత్రించాలన్నది ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా ఉంది.

# స్వాతంత్ర్య వేళ 'స్మార్ట్' రేషన్ కార్డులు

## 15న సంగారెడ్డిలో ప్రారంభించనున్న సీఎం రేవంత్

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, ఆగస్టు 7:** తెలంగాణలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న రాష్ట్రవ్యాప్తంగా 1.06 కోట్ల కొత్త స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టనుంది. సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 3.42 కోట్ల మంది లబ్ధిదారులు ఈ కార్డుల పరిధిలోకి రానున్నారని తెలిపారు. కొత్త రేషన్ కార్డుల ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రజా పంపిణీ వ్యవస్థ కింద నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యాన్ని ఉచితంగా అందించనున్నట్లు మంత్రి చెప్పారు. మొత్తం లబ్ధిదారుల అవసరాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా సుమారు 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని పంపిణీ చేయనుందని వివరించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో దృశ్యమాధ్యమ సమావేశం నిర్వహించారు. ఆగస్టు 15న సంగారెడ్డిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, అదే సమయంలో మిగిలిన 32 జిల్లాల్లోనూ కార్డుల పంపిణీ ప్రారంభం కావాలని ఆదేశించారు. అన్ని జిల్లాల్లో కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు ముందస్తుగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్లకు సూచించారు. పౌరసరఫరాల శాఖతో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. కార్డుల కోసం వచ్చే లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ఆహార భద్రత కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపడుతోందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. 1.06 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డుల పరిధిలో ఏకంగా 3.42 కోట్ల మంది లబ్ధిదారులు ఉండటం ఈ కార్యక్రమం విస్తృతికి నిదర్శనమన్నారు. స్వతంత్ర భారతదేశంలో అమలవుతున్న అత్యంత ప్రభావవంతమైన ఆహార భద్రత కార్యక్రమాల్లో ఇది ఒకటని మంత్రి అభివర్ణించారు. ఇంతటి బృహత్తర కార్యక్రమంలో తాను భాగస్వామిని కావడం సంతోషంగా ఉందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆహార భద్రతతో పాటు




గౌరవప్రదమైన జీవనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో కార్యక్రమం ప్రారంభమవుతున్నందున జిల్లా యంత్రాంగం దీనికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. కార్డుల పంపిణీలో ఆలస్యం లేకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులు, ఇతర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ఆగస్టు 15 నుంచే అన్ని జిల్లాల్లో లబ్ధిదారులకు కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# 'నా భర్తను చంపు.. లేదంటే నేనే చనిపోతా!'

- భార్య ఫోన్‌లో సందేశాలు చూసి భర్త షాక్
- ప్రియుడితో కలిసి హత్యకు కుట్ర పన్నిందని ఆరోపణ
- వెంటాడినట్లు ఫిర్యాదు.. తప్పించుకుని ఇంటికి చేరిన భర్త
- డోర్నకల్ పోలీస్‌స్టేషన్‌లో జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు

**డోర్నకల్, ఆగస్టు 7:** 'ఎలాగైనా నా భర్తను చంపు.. లేదంటే నేనే చనిపోతా' అంటూ భార్య తన ప్రియుడికి పంపినట్లు చెబుతున్న సందేశాలు భర్త కంటపడటం కలకలం రేపింది. తనను హత్య చేసేందుకు భార్య, ఆమె ప్రియుడు కుట్ర పన్నారని ఆరోపిస్తూ బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం చిలుకోడు గ్రామంలో వెలుగుచూసిన ఈ ఘటన స్థానికంగా సంచలనంగా మారింది. చిలుకోడు గ్రామానికి చెందిన గాదె రాజేశ్వరరావుకు 2016లో సూర్యాపేట జిల్లాకు చెందిన భవానితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొంతకాలంగా భవానికి సైదులు అనే కొరియర్ ఉద్యోగితో వివాహేతర సంబంధం కొనసాగుతోందని రాజేశ్వరరావు ఆరోపించారు. ఈ విషయం గత నెల 27న తనకు తెలిసిందని, దీంతో కుటుంబ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించినట్లు ఆయన పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం తన అన్నను తీసుకురావడానికి వెళ్తున్న సమయంలో సైదులు తనను వెంబడించాడని ఆరోపించారు. అతడి నుంచి తప్పించుకుని తిరిగి ఇంటికి చేరుకున్నట్లు తెలిపారు. అనంతరం భార్య ఫోన్‌ను పరిశీలించగా వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్‌లో జరిగినట్లు చెబుతున్న సంభాషణలు చూసి దిగ్భ్రాంతికి గురైనట్లు రాజేశ్వరరావు పేర్కొన్నారు. తనను ఎలాగైనా చంపాలని, అలా చేయకపోతే తాను చనిపోతానంటూ భవాని సైదులుకు సందేశాలు పంపినట్లు గుర్తించానని ఆరోపించారు. తన ప్రాణాలకు ముప్పు ఉందని పేర్కొంటూ రాజేశ్వరరావు డోర్నకల్ పోలీసులను ఆశ్రయించారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు సమాచారం. భార్యాభర్తల మధ్య వివాదం, ఆరోపణలు, సామాజిక మాధ్యమాల్లో జరిగినట్లు




చెబుతున్న సంభాషణలపై పోలీసులు విచారణ చేపట్టారు. ఆరోపణల్లో వాస్తవాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# తెలంగాణ నీటి హక్కులను కాపాడాలి

- జీఆర్ఎంబీ అజెండాలోని మూడు అంశాలను ఉపసంహరించాలి
- కేంద్ర మంత్రికి హరీశ్‌రావు లేఖ



**హైదరాబాద్, ఆగస్టు 7:** తెలంగాణకు చట్టబద్ధంగా దక్కిన నీటి హక్కులను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం–2014లోని సెక్షన్ 85 ప్రకారం తెలంగాణకు లభించిన హక్కులకు భంగం కలగకుండా చూడాలని కోరుతూ కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌కు ఆయన లేఖ రాశారు. గోదావరి నదీ యాజమాన్య బోర్డు 18వ సమావేశ అజెండాలో చేర్చిన 18.3.1, 18.3.6, 18.3.11 అంశాలను వెంటనే ఉపసంహరించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని పలు కీలక సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం, సాంకేతిక సలహా కమిటీ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఇప్పటికే సమగ్ర పరిశీలన అనంతరం అనుమతులు ఇచ్చాయని హరీశ్‌రావు గుర్తుచేశారు. సాంకేతిక, జలవిజ్ఞాన, ఇంజినీరింగ్, పర్యావరణ, చట్టపరమైన అంశాలను పరిశీలించిన తర్వాతే ఆయా అనుమతులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ సమర్థ సంస్థలు ఇచ్చిన అనుమతులను జీఆర్ఎంబీ వంటి అనుబంధ సంస్థలు తిరిగి సమీక్షించడం లేదా వాటిపై సందేహాలు లేవనెత్తడం సరికాదన్నారు. ఇలాంటి చర్యలతో కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జల సంఘం అధికారాలే బలహీనపడతాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కేంద్ర సంస్థలు ఇచ్చే అనుమతుల విశ్వసనీయతపైనా అనిశ్చితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది కేవలం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య నీటి వివాదానికి సంబంధించిన అంశం కాదని, కేంద్ర ప్రభుత్వ నిర్ణయ ప్రక్రియ చట్టబద్ధత, విశ్వసనీయతకు సంబంధించిన విషయమని స్పష్టం చేశారు. జీఆర్ఎంబీ సమావేశ అజెండాలో కాళేశ్వరం, చౌటుపల్లి హనుమంతరెడ్డి, ముక్తేశ్వరం, చనకా–కొరట, మోదికుంటవాగు, కడెం–గూడెం, సీతారామ ఎత్తిపోతల పథకం వంటి తెలంగాణ ప్రాజెక్టులకు ఇప్పటికే లభించిన అనుమతులను తిరిగి పరిశీలించే అంశాలు ఉన్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. నిర్దేశిత చట్టబద్ధ ప్రక్రియను పూర్తి చేసిన తర్వాతే ఈ ప్రాజెక్టులకు కేంద్ర సంస్థలు అనుమతులు ఇచ్చాయని గుర్తుచేశారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ నీటి వాటా విషయంలో జీఆర్ఎంబీ, కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ గతంలో తీసుకున్న నిర్ణయాలను గౌరవించాలని కోరారు. ఇప్పటికే కేంద్ర జల సంఘం పరిశీలించి అనుమతులు ఇచ్చిన ప్రాజెక్టులను మళ్లీ సమీక్షకు తీసుకురావడం తెలంగాణ సాగునీటి ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తుందని పేర్కొన్నారు. రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో అంతర్ పరివాహక ప్రాంతాలకు నీటిని మళ్లించే ముందు సంబంధిత పరివాహక ప్రాంతాల్లోని ప్రాజెక్టుల అవసరాలను తీర్చాలనే అంశం నమోదైందని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర జల సంఘం జలవిజ్ఞానపరంగా ఇప్పటికే అంగీకరించిన సమ్మక్క సాగర్ ఎత్తిపోతల పథకానికి మిగిలిన చట్టబద్ధ అనుమతులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఇప్పటికే అనుమతులు పొందిన ప్రాజెక్టులను తిరిగి సమీక్షించడం వల్ల సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధితో పాటు తాగునీటి భద్రతపైనా ప్రభావం పడుతుందని హెచ్చరించారు. తెలంగాణలోని లక్షలాది మంది రైతుల ప్రయోజనాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. జీఆర్ఎంబీ 18వ సమావేశ అజెండాలోని 18.3.1, 18.3.6, 18.3.11 అంశాలను తక్షణమే ఉపసంహరించేలా ఆదేశించాలని హరీశ్‌రావు కోరారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జల సంఘం ఇప్పటికే మంజూరు చేసిన సాంకేతిక సలహా కమిటీ అనుమతులను జీఆర్ఎంబీ తిరిగి సమీక్షించకుండా స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమ్మక్క సాగర్ ఎత్తిపోతల పథకంతో పాటు తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న అర్హత కలిగిన సాగునీటి ప్రాజెక్టులకు మిగిలిన అనుమతులను వేగంగా మంజూరు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం సకాలంలో జోక్యం చేసుకుంటే ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని నిబంధనలతో పాటు తెలంగాణ నీటి హక్కులు పరిరక్షించబడతాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. అదే సమయంలో కేంద్ర సంస్థలు ఇచ్చే చట్టబద్ధ అనుమతులపై విశ్వసనీయత కూడా నిలుస్తుందని స్పష్టం చేశారు.

# నేతన్నను నట్టేట ముంచారు

- చేనేత సంక్షోభంపై సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ
- నిలిచిన సంక్షేమ పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్
- చేనేత భరోసా, రుణమాఫీ హామీలు ఏమయ్యాయని ప్రశ్న
- బీమా, చేయూతతో గతంలో నేతన్నలకు అండగా నిలిచామని వెల్లడి
- కేంద్ర నిర్ణయాలతోనూ చేనేత రంగానికి తీవ్ర నష్టమని విమర్శ



**హైదరాబాద్, ఆగస్టు 7:** తెలంగాణ సంస్కృతి, అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిన చేనేత రంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో నేతన్నలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలను నిలిపివేయడంతో వేలాది చేనేత కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని విమర్శించారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. నిలిచిపోయిన పథకాలను వెంటనే పునరుద్ధరించడంతో పాటు ఎన్నికల సమయంలో నేతన్నలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన 'నేతన్న బీమా', 'నేతన్నకు చేయూత' పథకాలు చేనేత కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాయని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 55 వేల మందికిపైగా చేనేత కార్మికులకు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కార్మికుల పొదుపును ప్రోత్సహించేలా ప్రభుత్వం తన వాటాను జమ చేసిన 'నేతన్నకు చేయూత' దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. చేనేత సహకార సంఘాలకు పావలా వడ్డీ రుణాలు, మార్కెటింగ్ రిబేట్లు అందించడంతో పాటు బతుకమ్మ చీరలు, ప్రభుత్వ పాఠశాలల యూనిఫారాల తయారీ ఆర్డర్లు ఇచ్చి వేలాది నేతన్న కుటుంబాలకు నిరంతర ఉపాధి కల్పించినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో అమలైన చేనేత సంక్షేమ పథకాలను నిలిపివేసిందని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో నేతన్నలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. చేనేత భరోసా కింద ఏటా రూ.18 వేల ఆర్థిక సాయం, అనుబంధ కార్మికులకు రూ.6 వేల సాయం, వ్యక్తిగత రుణమాఫీ, సహకార సంఘాల రుణమాఫీ, జీఎస్టీ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్న హామీల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రెండున్నరేళ్లు గడిచినా నేతన్నల జీవితాల్లో ఆశించిన మార్పు కనిపించడం లేదన్నారు. చేనేత రంగం విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని కేటీఆర్ విమర్శించారు. అఖిల భారత చేనేత బోర్డు, హస్తకళల బోర్డు, మరమగ్గాల బోర్డుల రద్దుతో పాటు పలు సంక్షేమ పథకాలను నిలిపివేయడం చేనేత రంగానికి నష్టం చేసిందన్నారు. చేనేత ఉత్పత్తులపై 5శాతం జీఎస్టీ విధించడం నేతన్నలపై మరింత భారాన్ని మోపిందని పేర్కొన్నారు. చేనేత రంగం విషయంలో కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల విధానాల్లో పెద్దగా తేడా లేదని విమర్శించారు. నేతన్నల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన చేనేత సంక్షేమ పథకాలన్నింటినీ పునరుద్ధరించి, పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. చేనేత భరోసా, రుణమాఫీ, జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ సహా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి నేతన్న కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. నేతన్నల జీవనోపాధిని కాపాడితేనే చేనేత రంగంతో పాటు తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవం నిలుస్తాయని కేటీఆర్ తన బహిరంగ లేఖలో పేర్కొన్నారు.

# వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

- తెలంగాణలో ఒంటరిగానే అధికారంలోకి..
- జనసేన సహా ఏ పార్టీతోనూ పొత్తు ఉండదు
- 937 మండలాల్లో పార్టీ బలోపేతానికి కార్యాచరణ
- కీలక నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు




**ఢిల్లీ, ఆగస్టు 7:** తెలంగాణలో వచ్చే ఎన్నికల్లో ఎవరితోనూ పొత్తు లేకుండా సొంతంగా అధికారంలోకి రావడమే తమ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు స్పష్టం చేశారు. జనసేన సహా ఏ పార్టీతోనూ రాష్ట్రస్థాయిలో పొత్తు పెట్టుకునే ఆలోచన లేదని తేల్చిచెప్పారు. అయితే ఎన్డీయేలో జనసేన భాగస్వామిగా ఉన్నందున ఆ అంశంపై ఏదైనా నిర్ణయం ఉంటే జాతీయస్థాయిలోనే తీసుకుంటారని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు రాష్ట్రానికి చెందిన ఎంపీలు శుక్రవారం ఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌తో సమావేశమయ్యారు. తెలంగాణలో పార్టీ బలోపేతం, సంస్థాగత విస్తరణ, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. నియోజకవర్గాల వారీగా పార్టీ బలాబలాలను సమీక్షించారు. సమావేశం అనంతరం రామచందర్‌రావు మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి వచ్చేందుకు స్పష్టమైన కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 937 మండలాల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ తరహాలో తెలంగాణలోనూ బీజేపీని బలోపేతం చేసి అధికారంలోకి వస్తామని రామచందర్‌రావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని పలువురు కీలక నేతలు బీజేపీలో చేరేందుకు సరైన సమయం కోసం ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించారు. రాబోయే రోజుల్లో పార్టీలో కీలక చేరికలు ఉంటాయనే సంకేతాలిచ్చారు. బీజేపీ రాష్ట్ర నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవని, కొన్ని అంశాల్లో భిన్నాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని చెప్పారు. పార్టీ నాయకత్వమంతా ఒకే లక్ష్యంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని ఆరోపించిన రామచందర్‌రావు.. ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా సమస్యలపై సమష్టిగా పోరాటం చేయాలని జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ దిశానిర్దేశం చేసినట్లు తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో మరోసారి సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి నితిన్ నబిన్ తెలంగాణకు వచ్చి రాష్ట్ర నేతలతో సమావేశమవుతారని తెలిపారు. పార్టీ సంస్థాగత పరిస్థితిని సమీక్షించడంతో పాటు భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేస్తారని వెల్లడించారు. సమావేశంలో సునీల్ బన్సల్, అభయ్ పాటిల్ తదితర నేతలు పాల్గొన్నారు.




# అధికారులను కోర్టుకు పిలిపించడం బాధాకరం

- ప్రభుత్వాలు చేసిన తప్పులతోనే అధికారులకు ఈ పరిస్థితి
- ఉచిత పథకాలతో రాష్ట్ర ఖజానాపై తీవ్ర భారం
- సంపన్నులు, అధికారులు రైతుబంధు తీసుకోవడం బాధాకరం
- సందీప్ సుల్తానియా కేసు విచారణలో హైకోర్టు కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, ఆగస్టు 7:** ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాల కారణంగా ఉన్నతాధికారులు కోర్టుల చుట్టూ తిరగాల్సి రావడం బాధాకరమని తెలంగాణ హైకోర్టు వ్యాఖ్యానించింది. కోర్టు ధిక్కరణ వ్యవహారంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా వ్యక్తిగతంగా హైకోర్టు ముందు హాజరైన సందర్భంగా న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. సందీప్ సుల్తానియాపై దాదాపు వెయ్యి కేసులు ఉన్నాయని పేర్కొన్న హైకోర్టు.. వాటన్నింటినీ విచారించి శిక్షలు విధించే పరిస్థితి వస్తే జీవితకాలం జైలులోనే ఉండాల్సి వస్తుందని వ్యాఖ్యానించింది. అయితే ప్రభుత్వాలు చేసిన తప్పుల కారణంగానే అధికారులకు ఇటువంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని అభిప్రాయపడింది. ఉన్నతాధికారులను పదేపదే హైకోర్టుకు పిలిపించడం తమకూ బాధగానే ఉందని న్యాయస్థానం పేర్కొంది. అయితే కోర్టు ఆదేశాలు అమలు కానప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లోనే అధికారులను వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించాల్సి వస్తోందని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉచిత పథకాలపైనా హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఉచిత పథకాల వల్ల ఆర్థికంగా ప్రమాదకర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని అభిప్రాయపడింది. రైతుబంధు వంటి పథకాల ప్రయోజనాలను సంపన్నులతో పాటు అధికారులు కూడా పొందడం బాధాకరమని పేర్కొంది. అర్హతతో సంబంధం లేకుండా ప్రయోజనాలు అందించడం వల్ల రాష్ట్ర ఖజానాపై అదనపు భారం పడుతుందని వ్యాఖ్యానించింది. ప్రజాధనాన్ని వినియోగించే విషయంలో ప్రభుత్వాలు జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని విచారణ సందర్భంగా హైకోర్టు అభిప్రాయపడింది.

# ఫీజు వివరాలు నోటీసు బోర్డులో పెట్టాల్సిందే

- ప్రైవేట్ పాఠశాలలకు విద్యాశాఖ కీలక ఆదేశాలు
- తరగతుల వారీగా ఫీజుల వివరాలు బహిరంగంగా ప్రదర్శించాలి
- పాఠశాల వెబ్‌సైట్, విద్యాశాఖ పోర్టల్‌లోనూ నమోదు చేయాలి
- నిబంధనలు ఉల్లంఘిస్తే గుర్తింపు రద్దు చేసే అవకాశం

**హైదరాబాద్, ఆగస్టు 7:** తెలంగాణలోని ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల వసూళ్లలో పారదర్శకత పెంచేందుకు పాఠశాల విద్యాశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రతి ప్రైవేట్ పాఠశాల తరగతుల వారీగా వసూలు చేసే ఫీజుల వివరాలను తప్పనిసరిగా బహిరంగపరచాలని స్పష్టం చేసింది. ఇందులో భాగంగా పాఠశాల ప్రాంగణంలోని నోటీసు బోర్డుపై ఫీజుల వివరాలను స్పష్టంగా ప్రదర్శించడంతో పాటు పాఠశాల అధికారిక వెబ్‌సైట్‌లోనూ అందుబాటులో ఉంచాలని ఆదేశించింది.

## విద్యాశాఖ పోర్టల్‌లోనూ నమోదు

ఫీజుల వివరాలను విద్యాశాఖ అధికారిక పోర్టల్‌లోనూ నమోదు చేయాల్సి ఉంటుంది. ఫీజులను ఏ ప్రాతిపదికన నిర్ణయించారో తెలిపే పత్రాలతో పాటు పాలకవర్గ సభ్యుల సంతకాలతో కూడిన తీర్మాన ప్రతులను కూడా పోర్టల్‌లో దాఖలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనివల్ల పాఠశాలలు వసూలు చేస్తున్న ఫీజులపై తల్లిదండ్రులకు స్పష్టత లభించనుంది.

## ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

జీఓ ఎంఎస్ నంబర్ 1 (1994)లోని నిబంధనల ప్రకారం ఫీజుల వివరాలను ప్రదర్శించని పాఠశాలలకు జిల్లా విద్యాధికారులు వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని విద్యాశాఖ స్పష్టం చేసింది. నిబంధనలను ఉల్లంఘించిన పాఠశాలలపై అదే జీఓలోని రూల్ 11 ప్రకారం అనుమతులు లేదా గుర్తింపును రద్దు చేసే చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ ఉత్తర్వుల అమలును జిల్లా విద్యాధికారులు, ప్రాంతీయ సంయుక్త డైరెక్టర్లు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించింది. ఫీజుల పేరుతో తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం పడకుండా పారదర్శకతను కాపాడాలని విద్యాశాఖ స్పష్టం చేసింది.



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



## సంపాదకీయం



# మనుషుల మధ్య గోడలు ఎందుకు?

### కులం, మతం పేరుతో ఇంకా ఎంతకాలం వివక్ష?

### శాస్త్రం ముందుకు దూసుకెళ్తుంటే మనసులు మాత్రం వెనక్కేనా?

### విద్వేషం కాదు.. మానవత్వమే భారతీయతకు అసలైన చిరునామా

### సమానత్వం, సౌభ్రాతృత్వమే రాజ్యాంగ స్ఫూర్తి

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రచనల్లో పేర్కొన్న అనేక సంఘటనలు భారత సమాజంలో ఒకప్పుడు ఎంత తీవ్రమైన కుల వివక్ష ఉండేదో మనకు గుర్తుచేస్తాయి. కింది కులానికి చెందిన వారు తమ పెళ్లి భోజనంలో పాయసం వండుకున్నారనే కారణంతోనే దాడులకు గురైన ఘటనలను ఆయన ప్రస్తావించారు. తమ కష్టార్జితంతో సంపాదించిన ఆహారం తినే హక్కు కూడా లేని పరిస్థితి ఒకప్పుడు ఈ సమాజంలో ఉండేదంటే అది ఎంతటి అమానవీయ వ్యవస్థో అర్థమవుతుంది. కాలం మారింది. దేశం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలోకి ప్రవేశించింది. అంతరిక్షంలో అడుగులు వేస్తోంది. జన్యుశాస్త్రం మనుషుల మధ్య జీవశాస్త్రపరంగా పెద్దగా విభజనలు లేవని చెబుతోంది. అయినా కులం, మతం, వర్గం పేరుతో మనుషులను వేరుచేసే మనస్తత్వం మాత్రం పూర్తిగా మాయమైపోలేదు. ఇదే మన సమాజానికి అతిపెద్ద వైరుధ్యం. ఒకప్పుడు అగ్రవర్ణ ఆధిపత్యం రూపంలో కనిపించిన వివక్ష, ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లో ఆర్థికంగా, సామాజికంగా బలపడిన ఇతర వర్గాల మధ్య కూడా పునరావృతమవుతున్నదనే విమర్శలు ఉన్నాయి. అంటే సమస్య కేవలం ఒక కులానికి, ఒక మతానికి పరిమితం కాదు. అధికార భావం ఎక్కడ పెరిగితే అక్కడ దమనకాండ పుట్టుకొస్తుంది. అందుకే సమానత్వం అనే విలువను సమాజం మొత్తంగా ఆచరించాల్సిన అవసరం ఉంది. మతపరమైన గుర్తింపుతో అవమానాలు ఎదుర్కొంటున్న అనేక మంది జీవిత కథలు మన చుట్టూ ఉన్నాయి. చిన్నప్పటి నుంచే తన ముస్లిం గుర్తింపు కారణంగా హేళనలు, తిరస్కారాలు ఎదుర్కొన్న ఒక యువ జర్నలిస్టు అనుభవాలు ఈ విషయంలో మనకు అద్దం పడతాయి. బాల్యంలో తోటి పిల్లల మాటల నుంచి, హాస్టల్ వార్డెన్ వ్యాఖ్యల వరకు, కళాశాల ఉపాధ్యాయుడి అనుచిత ప్రవర్తన నుంచి పరిచయస్తుల దూరత్వం వరకు అతడు అనుభవించిన వివక్ష ఒక వ్యక్తిని ఎంతగా మానసికంగా గాయపరుస్తుందో చూపిస్తుంది. ఒక పిల్లవాడిని అతని మతం ఆధారంగా హేళన చేయడం, ఒక విద్యార్థిని అతని పేరుతోనే ఉగ్రవాదంతో అనుసంధానించడం, ఒక సహపాఠిని అతని జన్మపరమైన గుర్తింపుతో దూరం పెట్టడం ఇవన్నీ వ్యక్తిగత అవమానాలు మాత్రమే కావు. సమాజం తనలో దాచుకున్న వివక్షకు అవి ప్రతిబింబాలు. కర్నాటకలో ఒక ఉపాధ్యాయుడు తరగతి గదిలో ముస్లిం విద్యార్థిని ఉగ్రవాదిగా సంబోధించినట్లు గతంలో వెలువడిన ఘటనలు కూడా మన విద్యా వ్యవస్థలో విలువల బోధన ఎంత అవసరమో గుర్తుచేశాయి. పిల్లలకు జ్ఞానం అందించాల్సిన ఉపాధ్యాయుడే పక్షపాత భావనలను ప్రదర్శిస్తే విద్యకు అర్థమేంటి అనే ప్రశ్న తలెత్తుతుంది. చట్టం ముందు అందరూ సమానులని రాజ్యాంగం స్పష్టం చేసింది. కులం, మతం, జాతి, లింగం పేరుతో వివక్ష చూపరాదని ప్రకటించింది. అయితే చట్టాల్లో ఉన్న సమానత్వం సామాజిక జీవితంలోనూ కనిపించాలి. పుస్తకాల్లో సమానత్వం చదివి, ప్రవర్తనలో మాత్రం వివక్ష చూపితే రాజ్యాంగ విలువలు కేవలం అక్షరాలుగానే మిగిలిపోతాయి. అదే సమయంలో భారత సమాజంలో మానవత్వానికి అద్భుత ఉదాహరణలూ ఉన్నాయి. కర్నాటకలో తల్లిదండ్రులను కోల్పోయిన ఇద్దరు హిందూ పిల్లలను మహబూబ్, నూర్జహాన్ అనే ముస్లిం దంపతులు తమ పిల్లల్లా పెంచి, వారి మతం మార్చకుండా, వారి సంప్రదాయం ప్రకారమే వివాహం జరిపించిన సంఘటన మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం. మతం కన్నా మనిషి గొప్పవాడని చెప్పడానికి ఇలాంటి ఉదాహరణలు చాలు. మన జాతీయ చరిత్రలోనూ వివిధ మతాల ప్రజలు భారత నిర్మాణంలో విశేష పాత్ర పోషించారు. 'జైహింద్' అనే నినాదాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చిన ఆబిద్ హసన్ సఫ్రానీ నుంచి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వేలాది మంది ముస్లింల వరకు భారత జాతీయోద్యమం సహజంగానే బహుళత్వాన్ని ప్రతిబింబించింది. దేశభక్తికి మతం కొలమానం కాదని చరిత్ర ఎన్నోసార్లు నిరూపించింది. భారతదేశం ఏ ఒక్క కులానిదో, ఏ ఒక్క మతానిదో కాదు. ఇది అందరిదీ. జాతీయ పతాకం, జాతీయ గీతం, రాజ్యాంగం అన్నీ మన సమిష్టి గుర్తింపులు. 'మేరా భారత్ మహాన్' అని చెప్పడం అంటే మనతో సమానంగా జీవిస్తున్న ప్రతి భారతీయుడిని గౌరవించడం కూడా. విద్వేష ప్రసంగాలు తాత్కాలికంగా రాజకీయ ప్రయోజనాలు ఇవ్వవచ్చు. కానీ అవి సమాజంలో దీర్ఘకాలిక గాయాలు మిగులుస్తాయి. ఒకసారి ప్రజల మధ్య అనుమానం, భయం, శత్రుత్వం పెరిగితే దాన్ని తొలగించడం చాలా కష్టం. అందుకే పాలకులు, రాజకీయ పార్టీలు, మత నాయకులు, మీడియా, విద్యావంతులు అందరూ తమ మాటల విషయంలో బాధ్యత వహించాలి. శాస్త్రం మనుషులందరూ ఒకే మానవజాతికి చెందినవారని చెబుతోంది. రాజ్యాంగం అందరూ సమానులని చెబుతోంది. మానవత్వం ఒకరిని ఒకరు ఆదుకోవాలని చెబుతోంది. మరి మనం ఇంకా కులం, మతం పేరుతో ఒకరిని ఒకరు ద్వేషించుకోవడం ఎందుకు? నాగరికత అంటే కేవలం పెద్ద నగరాలు, సాంకేతిక విజ్ఞానం, అంతరిక్ష ప్రయోగాలు కాదు. మనతో విభిన్నంగా ఉన్న వ్యక్తిని కూడా సమాన గౌరవంతో చూడగలగడమే నిజమైన నాగరికత. మతం మారినా మనిషి మారడు. కులం మారినా రక్తం రంగు మారదు. భాష మారినా కన్నీటి రుచి మారదు. అందుకే నేటి భారతదేశానికి అత్యవసరంగా కావాల్సింది కొత్త విద్వేషాలు కాదు.. కొత్త మానవత్వం. మనువాదపు నిచ్చెనమెట్లు కాదు.. రాజ్యాంగ సమానత్వం. పరస్పర అనుమానం కాదు.. సౌభ్రాతృత్వం. మనిషిని మనిషిగా చూడగల దృష్టి పెరిగినప్పుడే భారతదేశం నిజమైన అర్థంలో మహోన్నత దేశంగా నిలుస్తుంది.

# ఆందోళన వద్దు.. మీకు నేనున్నా

- ఎన్డీఏ ఎంపీలకు ప్రధాని మోదీ భరోసా
- కూటమిలో ప్రతి ఎంపీకి సమాన గౌరవం
- నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టండి
- అవసరమైతే నేరుగా ప్రధాని కార్యాలయాన్ని సంప్రదించండి
- పార్లమెంట్‌లో అంతరాయాలతో కొత్త ఎంపీలకు అవకాశం దక్కడం లేదని ఆవేదన



**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** "ఎన్డీఏ ఒక కుటుంబం. కూటమిలోని ప్రతి పార్టీ ఎంపీకి సమాన గౌరవం ఉంటుంది. నేను ఒక పార్టీకి మాత్రమే కాదు.. ప్రతి ఎంపీకి అండగా ఉంటాను. ఎలాంటి ఆందోళన అవసరం లేదు" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భరోసా ఇచ్చారు. కొత్తగా ఎన్నికైన ఎన్డీఏ ఎంపీలతో శుక్రవారం నిర్వహించిన అల్పాహార సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యానికి పార్లమెంట్ అత్యున్నత దేవాలయమని మోదీ పేర్కొన్నారు. ఇటీవల సభలో జరుగుతున్న ఆందోళనలు, అంతరాయాల కారణంగా కొత్తగా ఎన్నికైన ఎంపీలకు మాట్లాడే అవకాశం దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సభ సజావుగా సాగాలని, ప్రతి సభ్యుడూ తన అభిప్రాయాలను వెల్లడించే వాతావరణం ఉండాలని ఆకాంక్షించారు. పార్లమెంట్ చరిత్రను ఎంపీలు అధ్యయనం చేయాలని మోదీ సూచించారు. గతంలో జరిగిన కీలక చర్చలు, సభ్యుల ప్రసంగాలు, పార్లమెంటరీ సంప్రదాయాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా సభలో తమ ప్రసంగాలను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. దేశాభివృద్ధి రాష్ట్రాల ప్రగతితోనే సాధ్యమవుతుందని పేర్కొన్న ప్రధాని.. ప్రతి ఎంపీ తన నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమస్యలు ఎదురైతే అవసరమైతే నేరుగా ప్రధాని కార్యాలయాన్ని సంప్రదించవచ్చని చెప్పారు. పేదలు, రైతులు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని ఎంపీలకు సూచించారు. ఈ సమావేశానికి శివసేన నుంచి ఏడుగురు, ఎన్సీపీఐ నుంచి 20 మంది, ఎన్సీపీ అజిత్ పవార్ వర్గం నుంచి ఇద్దరు సహా సుమారు 45 మంది ఎంపీలు హాజరయ్యారు. ఇటీవల తృణమూల్ కాంగ్రెస్‌ను వీడి ఎన్డీఏలో చేరిన ఎంపీలు, ఉద్ధవ్ ఠాక్రే వర్గం నుంచి బయటకు వచ్చి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనలో చేరిన ఎంపీలకు మోదీ ప్రత్యేకంగా భరోసా ఇచ్చారు. "ఎన్డీఏలో చిన్న పార్టీ, పెద్ద పార్టీ అనే తేడా లేదు. ప్రతి ఎంపీకి సమానమైన గౌరవం ఉంటుంది. మీకు అండగా నేనున్నాను" అని మోదీ స్పష్టం చేసినట్లు సమాచారం. సమావేశం అనంతరం ఒక్కో ఎంపీతో విడివిడిగా మాట్లాడిన ప్రధాని వారి నియోజకవర్గాల్లోని పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆరా తీశారు. అంతకుముందు రోజు తన నివాసంలో బీజేపీకి చెందిన 37 మంది ఎంపీలతోనూ మోదీ విందు సమావేశం నిర్వహించారు. పాలన, పార్లమెంటరీ వ్యవహారాలు, ప్రజాసేవపై వారితో అభిప్రాయాలను పంచుకున్నారు. ఢిల్లీలో జరిగే రాజకీయ ప్రచారాల ప్రభావానికి లోనుకాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలతో అనుబంధాన్ని పెంచుకోవాలని, రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ ప్రతిపక్ష ఎంపీలతో సత్సంబంధాలు కొనసాగించాలని కూడా మోదీ సూచించినట్లు సమాచారం.



# చిత్తశుద్ధి ఉంటే అమిత్ షాతో రాజీనామా చేయించండి

### మోహన్ భాగవత్‌కు కేసీ వేణుగోపాల్ సవాల్

### జెన్‌జీపై ప్రేమ మాటల్లో కాదు.. చేతల్లో చూపాలి

### విద్యార్థులపై అణచివేతను ఎందుకు ఖండించలేదు?

### ప్రభుత్వాన్ని ఆరెస్సెస్ నియంత్రిస్తోందని ఆరోపణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** జెన్‌జీ యువతపై నిజంగా శ్రద్ధ, చిత్తశుద్ధి ఉంటే కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో రాజీనామా చేయించాలని ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్‌కు కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ సవాల్ విసిరారు. యువత ఆందోళనలు సమర్థనీయమైనవేనంటూ భాగవత్ చేసిన వ్యాఖ్యలపై శుక్రవారం ఆయన తీవ్రంగా స్పందించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వాన్ని ఆరెస్సెస్ నియంత్రిస్తోందని వేణుగోపాల్ ఆరోపించారు. అలాంటప్పుడు నిరసనలు చేస్తున్న విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలకు ఆ సంస్థ కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. జెన్‌జీ యువతపై భాగవత్‌కు నిజంగానే శ్రద్ధ ఉంటే అమిత్ షా రాజీనామాను కోరాలని డిమాండ్ చేశారు. "విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి ఉంటే పెల్లెట్ గన్స్ ప్రయోగం, లాఠీచార్జి రూపంలో జరిగిన అణచివేతను భాగవత్ బహిరంగంగా ఖండించాలి. కానీ ఇప్పటివరకు ఎందుకు మౌనంగా ఉన్నారు?" అని వేణుగోపాల్ ప్రశ్నించారు. యువతను అర్థం చేసుకోవాలని ఒకవైపు చెబుతూ, మరోవైపు వారి నిరసనలపై ప్రభుత్వ చర్యలను ప్రశ్నించకపోవడంలో అర్థం లేదన్నారు. విద్యార్థుల పక్షాన నిలబడాలనుకుంటే మాటలతో సరిపెట్టకుండా చర్యల ద్వారా నిరూపించుకోవాలని సూచించారు. లేదంటే జెన్‌జీపై చేస్తున్న వ్యాఖ్యలు కేవలం కంటితుడుపు చర్యలుగానే మిగిలిపోతాయని వేణుగోపాల్ విమర్శించారు.

# అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం కఠినతరం

### కీలక నిర్ణయం దిశగా ట్రంప్ ముందడుగు



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 7:** అమెరికాలో జన్మహక్కు పౌరసత్వం నిబంధనలను కఠినతరం చేసే దిశగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక ముందడుగు వేశారు. ఈ అంశంపై సుప్రీంకోర్టు నుంచి ఎదురుదెబ్బ తగిలిన కొన్ని వారాలకే, ఆ నిబంధనలను పరిమితం చేసేలా రెండు కొత్త ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై గురువారం ఆయన సంతకం చేశారు. గతంలో జారీ చేసిన విస్తృత ఆదేశాలతో పోలిస్తే ఇవి పరిమిత స్థాయిలో ఉన్నప్పటికీ, వీటిపై కూడా న్యాయపరమైన సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. మొదటి ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ ప్రకారం, కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో అమెరికాలో జన్మించిన పిల్లలకు పౌరసత్వం దక్కకుండా నిబంధనలు విధించారు. ఇద్దరు తల్లిదండ్రులు అమెరికా పౌరులు కానప్పుడు, వారిలో ఒకరిని 'శత్రు దేశస్థుడు'గా, అంటే విదేశీ ఉగ్రవాద సంస్థల్లో సభ్యుడిగా గుర్తిస్తే, వారి పిల్లలకు పౌరసత్వం వర్తించదు. దీంతోపాటు దౌత్యపరమైన మినహాయింపులు ఉన్న విదేశీ ప్రభుత్వ ఉద్యోగులు, కేవలం పౌరసత్వం కోసమే చేసుకున్న వాణిజ్య ఒప్పందాలు (కొన్ని సరోగసీ కేసులు), ఫెడరల్ చట్టం ద్వారా పౌరసత్వం కల్పించని యూఎస్ టెరిటరీలలో జన్మించిన వారికి కూడా ఈ నిబంధన వర్తిస్తుంది. ఇక, రెండో ఆదేశం పూర్తిగా 'బర్త్ టూరిజం'ను లక్ష్యంగా చేసుకుంది. కేవలం బిడ్డకు అమెరికా పౌరసత్వం ఇప్పించడం కోసమే దేశానికి వచ్చేవారిని అడ్డుకోవాలని ఈ ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఇలాంటి వారికి వీసాలు నిరాకరించడం, అధికారిక అనుమతులు రద్దు చేయడం, దేశంలోకి ప్రవేశాన్ని నిరోధించడం వంటి కఠిన చర్యలు తీసుకోవాలని హోంల్యాండ్ సెక్యూరిటీ, విదేశాంగ శాఖలను ఆదేశించారు. కాగా, 14వ రాజ్యాంగ సవరణ కింద అమెరికాలో పుట్టిన దాదాపు ప్రతి ఒక్కరికీ పౌరసత్వం లభిస్తుందని జూన్ 30న 'ట్రంప్ వర్సెస్ బార్బరా' కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు జన్మహక్కు పౌరసత్వాన్ని ఒక 'జోక్'గా మార్చిందని ట్రంప్ విమర్శించారు. అందుకే తమ ప్రభుత్వం 'కొన్ని సర్దుబాట్లు' చేస్తోందని వ్యాఖ్యానించారు. చారిత్రకంగా దౌత్యవేత్తలు, ఆక్రమణ దళాలకు చెందిన వారికి మాత్రమే ఈ నిబంధన నుంచి మినహాయింపులు ఉండేవి. ఇప్పుడు ట్రంప్ జారీ చేసిన ఈ కొత్త ఆదేశాలు సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొన్న మినహాయింపుల పరిధిలోనే ఉన్నప్పటికీ, వాటి సరిహద్దులను పరీక్షించేలా ఉన్నాయని, ఇవి కూడా న్యాయస్థానంలో సవాలుకు గురయ్యే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

# ఆ మూడు రోజులు సభలో ఉండాల్సిందే

### కాంగ్రెస్ ఎంపీలకు అధిష్ఠానం విప్



**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** పార్లమెంట్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో కాంగ్రెస్ అప్రమత్తమైంది. ఆగస్టు 10, 11, 12 తేదీల్లో లోక్‌సభ, రాజ్యసభలకు తమ ఎంపీలంతా తప్పనిసరిగా హాజరుకావాలని విప్ జారీ చేసింది. వివాదాస్పద విదేశీ విరాళాల నియంత్రణ చట్ట సవరణ బిల్లుపై ప్రభుత్వం చర్చ చేపట్టే అవకాశం ఉందన్న అంచనాల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్ విప్ జైరామ్ రమేశ్ పార్టీ సభ్యులకు విప్ జారీ చేశారు. మూడు రోజులపాటు సభలో అత్యంత కీలకమైన అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆయా రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి సభ వాయిదా పడే వరకు సభ్యులంతా తప్పనిసరిగా హాజరై పార్టీ వైఖరికి మద్దతుగా నిలవాలని సూచించారు. దీనిని అత్యంత ముఖ్యమైన అంశంగా పరిగణించాలని స్పష్టం చేశారు. లోక్‌సభలోని కాంగ్రెస్ సభ్యులకు కూడా ఇదే తరహాలో విప్ జారీ చేశారు. మూడు రోజులపాటు ఎంపీలంతా సభలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇండియా కూటమిలోని మిత్రపక్షాలకు కూడా సమాచారం అందించి, ఆయా పార్టీల ఎంపీలు పార్లమెంట్‌కు పూర్తి స్థాయిలో హాజరయ్యేలా చూడాలని కోరినట్లు సమాచారం. విదేశీ విరాళాల నియంత్రణ చట్ట సవరణ బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ముందుగానే తమ ఎంపీలను అప్రమత్తం చేయడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే వచ్చే వారానికి సంబంధించిన తాత్కాలిక ప్రభుత్వ కార్యకలాపాల జాబితాలో ఈ రెండు బిల్లుల ప్రస్తావన లేకపోవడం గమనార్హం. దీంతో మూడు రోజులపాటు పార్లమెంట్‌లో ఏ కీలక అంశాలు ముందుకొస్తాయన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# ఎఫ్‌సీఆర్ఏ చట్ట సవరణపై యూఎస్ ప్రజాప్రతినిధి అభ్యంతరం

### స్పందించిన భారత్

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** విదేశీ నిధుల నియంత్రణకు ఉద్దేశించిన ఎఫ్‌సీఆర్ఏ చట్టానికి భారత్ చేయనున్న సవరణలపై అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడు రైలీ మూర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పరిణామాలపై భారత విదేశాంగ శాఖ స్పందించింది. చట్టాలు, వాటి సవరణలు తమ అంతర్గత విషయాలని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. అమెరికా సహా అనేక దేశాల్లో ఇలాంటి చట్టాలు ఉన్నాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ప్రజాస్వామిక పద్ధతుల్లో భారత్ చట్టాల రూపకల్పన చేస్తుందని చెప్పారు. దేశీయ చట్టాలకు వాటికంటూ ప్రత్యేక నేపథ్యం ఉంటుందని చెప్పారు. ఈ దృష్టికోణంలోనే చట్టాలను విశ్లేషించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతిపాదిత సవరణలపై రైలీ మూర్ ఇటీవల స్పందిస్తూ పలు ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఈ సవరణలు చట్ట రూపం దాలిస్తే యూఎస్-భారత్ ద్వైపాక్షిక బంధాలు దెబ్బతింటాయని అన్నారు. ఈ సవరణలతో మతపరమైన చారిటీ సంస్థలను భారత్ నియంత్రించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ చట్టంతో క్రిస్టియన్ సంస్థలపైనే అధిక ప్రభావం పడేలా ఉందని అన్నారు. క్రిస్టియన్‌లను టార్గెట్ చేసుకున్నట్టు స్పష్టంగా కనిపిస్తోందని కూడా వ్యాఖ్యానించారు. అయితే, విదేశీ నిధులతో దేశ సార్వభౌమత్వం, సమగ్రత, భద్రత, ప్రజాప్రయోజనాలు, ప్రజాస్వామిక సంస్థలపై ప్రతికూల ప్రభావం పడకుండా భారత్ ఎఫ్‌సీఆర్ఏ చట్టాన్ని గతంలో తీసుకొచ్చింది. ఇక విదేశీ నిధులతో నడిచే సంస్థల కార్యకలాపాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం, మెరుగైన నిర్వహణ కోసమే తాజా మార్పులను ప్రతిపాదిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వవర్గాలు తెలిపాయి.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఈ నెల 15వ తేదీన నిర్వహించే స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని, ఇందుకు గాను అవసరమైన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్ రావు, చెన్నూరి కిష్టయ్య లతో కలిసి జిల్లా అధికారులతో స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15వ తేదీన స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. పోలీస్ గౌరవ వందనం, పతాకావిష్కరణ, వేదిక అలంకరణ, పోడియం, వాహనాలను పూలతో అలంకరించడం, షామియానా, కుర్చీలు, త్రాగునీరు, స్నాక్స్, టీ, స్టాల్స్ ఏర్పాటు, శకటాలు, సౌండ్ సిస్టం, ప్రసంగ ప్రతి, ప్రముఖుల సిట్టింగ్ నిర్వహణ, ఫోటో వీడియోగ్రఫీ, మీడియా గ్యాలరీ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా అధికారులు పర్యవేక్షించాలని, పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు, ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు అందించే ప్రశంసా పత్రాల కొరకు చక్కటి ప్రతిభ కనపరిచే ఉద్యోగులను ప్రతి శాఖ నుండి ఒకరు/ఇద్దరి జాబితాను ఈనెల 12వ తేదీ లోగా అందించాలని తెలిపారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి వేడుకలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. అగ్నిమాపక వాహనం అందుబాటులో ఉండాలని, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా 'ఆరోగ్యశ్రీ సాధన మహోత్సవం'



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఆరోగ్యశ్రీ పథక సాధకుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ నేతృత్వంలో సాగిన ఉద్యమాలను స్మరించుకుంటూ జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ప్రాంగణంలో ఎమ్మార్పీఎస్, ఎమ్ఎస్పీ ఆధ్వర్యంలో "ఆరోగ్యశ్రీ సాధన మహోత్సవం" ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, విద్యార్థులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రేగుంట కేశవ్ రావు మాదిగ మాట్లాడుతూ 2004లో గుండెజబ్బు పిల్లలతో మందకృష్ణ మాదిగ చేపట్టిన మహా ధర్నాతోనే నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకొచ్చారని, నేడు ఉచిత వైద్యంతో పాటు పెన్షన్లు ,6 కిలోల ఉచిత బియ్యం, ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ సాధన వెనుక ఆయన పోరాట ఫలితమే ఉందని కొనియాడారు. భవిష్యత్తులో కులరహిత సమాజం, మద్యపాన నిషేధం కోసం చేపడుతున్న ఉద్యమాలకు అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్టల సత్యనారాయణ, నిట్టూరి శ్రీశైలం, జిల్లె పల్లిమహేష్, ఖాన్ పేల్లి రాజలింగు, సిలారి సంతోష్, సిలారి మల్లే ష్ కిరణ్, శ్రావణ్, మహేష్, రాము, రాజేష్ తదితర విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

# ఎండిపోతున్న వరినార్లు ..



- వట్టివాగు ప్రాజెక్ట్ నీటిని వెంటనే విడుదల చేయాలి

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ మండల పరిధిలోని వట్టివాగు ప్రాజెక్ట్ నుండి సాగునీటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని నీటిపారుదల శాఖ డిఈ కార్యాలయంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితుల వల్ల ప్రాజెక్ట్‌లోకి నీరు చేరడం ఆలస్యమైనప్పటికీ, ఇటీవల కురిసిన సమృద్ధి వర్షాలకు ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యంతో నిండిందని తెలిపారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో రైతులు వరి నార్లు పోశారని, అయితే అధికారులు ప్రాజెక్ట్ నీటిని విడుదల చేయకపోవడంతో ఆ నార్లు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంత పొలాలు ఇతర ఆరుతడి పంటల సాగుకు అనుకూలంగా లేవని, కేవలం వరి పంటకే అనుకూలమని స్పష్టం చేశారు. వట్టివాగు ప్రాజెక్ట్ నిండుగా ఉన్నందున అధికారులు వెంటనే స్పందించి సాగునీటిని విడుదల చేస్తేనే రైతులు వరి పంటను కాపాడుకోగలుగుతారని కోరారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు గాజుల జక్కయ్య, మేకర్తి కాశయ్య, మిట్ట తిరుపతి, గడ్డల శంకర్, అడప సతీష్, మనిగొండ వెంకటేష్, గడ్డల సురేష్, పొలంపల్లి గణపతి, మిట్ట పోషణ, రుకుం ప్రహ్లాద్, పెద్దపల్లి శంకర్, బుసి భీమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యక్తిత్వ వికాసంతోనే విజయానికి బాట





**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** వ్యక్తిత్వ వికాసంతోనే విజయానికి బాట వేయవచ్చని వ్యక్తిత్వ వికాస శిక్షకుడు జవ్వాది వెంకటేశ్వరబాబు అన్నారు. సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలోని సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాలలో తొలి సంవత్సరం బీటెక్, డిప్లొమా, బి.ఫార్మసీ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రవేశ అవగాహన కార్యక్రమంలో భాగంగా వ్యక్తిత్వ వికాసం, వృత్తి మార్గదర్శకత్వం, ప్రేరణ అంశాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని సమయపాలన, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, బృంద భావన, సమర్థవంతమైన సంభాషణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. లక్ష్యసాధనకు నిరంతర కృషి, క్రమశిక్షణే విజయానికి బలమైన పునాదులని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పూటుకూరి శేషారత్నకుమారి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగి, విద్యతో పాటు మంచి విలువలను అలవర్చుకొని సమాజానికి ఆదర్శ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కాగా కళాశాల చైర్మన్ డాక్టర్ బండి పార్థసారథి రెడ్డి ,ట్రస్టీ బండి అన్విద వర్చువల్ ద్వారా పాల్గొని విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల కార్యదర్శి దాసరి ప్రభాకర్ రెడ్డి , వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ యాఖూబ్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ పార్ట్టైం స్వీపర్ల వేతనాలు పెంచాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** జిల్లా గ్రంథాలయ సంస్థల్లో పనిచేస్తున్న పార్ట్టైం స్వీపర్ల వేతనాలను పెంచేందుకు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్కు సిఫార్సు చేయాలని గ్రంథాలయ పార్ట్టైం స్వీపర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి చెరుకుపల్లి స్వామి తెలిపారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి అర్జున్ను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2023 నుంచి వేతనాల్లో ఎలాంటి పెరుగుదల లేకపోవడంతో తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలను సవరించాలని, పార్ట్టైం స్వీపర్ల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు. గత ఐదు నెలలుగా పూర్తి స్థాయిలో వేతనాలు కూడా అందడం లేదని, బకాయి వేతనాలను వెంటనే విడుదల చేసి, ఇకపై ప్రతినెలా సకాలంలో జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ గ్రంథాలయాల్లో పనిచేస్తున్న పార్ట్టైం స్వీపర్లు సాయికృష్ణ, సుజాత, సత్యనారాయణ, రామస్వామి, మధుకర్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'అమ్మపాల ఉత్సవాలు'



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్:** మండలంలోని తుంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గుడ్డెన్ ఘాట్ అంగన్‌వాడీ కేంద్రంలో అమ్మ పాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సర్పంచ్ టేకం ఈశ్వరి మాట్లాడుతూ నవజాత శిశువులకు తల్లి పాలే శ్రీరామరక్ష అని, బిడ్డ పుట్టిన వెంటనే ఇచ్చే ముర్రుపాలు పసి కందులకు ఎంతో శ్రేయస్కరమని తెలిపారు. పిల్లల్లో రోగనిరోధక శక్తిని పెంచడంలో తల్లి పాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి తల్లి తప్పనిసరిగా బిడ్డకు పాలు పట్టాలని ఆమె అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి జ్యోతి, సూపర్‌వైజర్ ఎం. యశోద , వార్డు సభ్యులు, అంగన్వాడీ టీచర్లు , గ్రామపంచాయతీ కారోబార్, గర్భిణీ స్త్రీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామంలో తాగు నీటి సమస్యకు పరిష్కారం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని కుప్టి గ్రామ ప్రజల దీర్ఘకాలిక తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని, వారి కోరిక మేరకు కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ చొరవతో గ్రామంలో నూతన బోరును మంజూరు చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అగ్గిమల్ల గోదావరి లక్ష్మన్న, ఉప సర్పంచ్ రవి, పీఏసీఎస్ చైర్మన్ రమేష్, బోథ్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీరామోజి నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మురళి గౌడ్, వార్డు మెంబర్ బొజ్జ వనిత నారాయణ, గ్రామస్తులు రాజు, విజయ్, సంజు, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్లో రాహుల్ గాంధీ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం



**ఉద్యమ కెరటం, నేరేడిగొండ:** ఉత్తర ప్రదేశ్లోని ప్రయాగ్రాజ్లో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న కార్యక్రమాన్ని ఆదిలాబాద్లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు యువజన కాంగ్రెస్ నాయకులు తెలిపారు. తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్ గౌడ్ ఆధ్వర్యంలో, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి పిలుపు మేరకు ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఈ లైవ్ స్ట్రీమింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ రాహుల్ గాంధీ ప్రసంగం, కార్యక్రమాన్ని వీక్షించేందుకు యువజన కాంగ్రెస్ శ్రేణులు, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# గుత్పాలలో ఉచిత వైద్య శిబిరం



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలను మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో గుత్పాల గ్రామంలో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి గ్రామ ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో వృద్ధులు, మహిళలు, యువకులు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య అధికారి డాక్టర్ సద్దాం నేతృత్వంలో సిబ్బంది ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించారు. జ్వరం, దగ్గు, కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్ తదితర సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. వ్యాధి లక్షణాలను బట్టి రోగులకు అవసరమైన ఉచిత మందులను అందజేశారు. సీజనల్ వ్యాదులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎ.సంతోష్, ఆరోగ్య సహాయకుడు నర్సయ్య, ఆశా కార్యకర్తలు గంగామణి, గంగుబాయి పాల్గొన్నారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం పట్ల స్థానిక సర్పంచ్, గ్రామస్థులు వైద్య సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవలను గ్రామాల్లో కొనసాగించాలని కోరారు.

# తప్పుడు జనన ధృవీకరణ పత్రం జారీ చేసిన పంచాయతీ కార్యదర్శి సస్పెండ్

## జిల్లా కలెక్టర్ కె.హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లాలోని సిర్పూర్ (టి) మండలం సిర్పూర్ (టి) గ్రామపంచాయతీలో తప్పుడు జనన ధృవీకరణ పత్రం జారీ చేసినట్లు నిర్ధారణ కావడంతో పంచాయితీ కార్యదర్శి సస్పెండ్ చేస్తూ కంప్యూటర్ ఆపరేటర్ ను విధుల నుండి తొలగించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. విచారణలో జనన మరణాల నమోదు చట్టం, 1969 నిబంధనలను ఉల్లంఘిస్తూ గ్రామపంచాయతీ కార్యదర్శి పైనీ తిరుపతి విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు నిర్ధారణ అయిందని, విచారణ నివేదిక ప్రకారం, సంబంధిత వ్యక్తి పొన్నం శ్రీనిధి కి సంబంధించిన జనన తేదీ రిజిస్టర్‌లో నమోదు లేకపోవడం, దరఖాస్తు స్వీకరించకపోవడం, అవసరమైన ఎటువంటి ఆధార పత్రాలను పరిశీలించకపోవడం జరిగిన ప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా నేరుగా యూనిఫైడ్ బర్త్ అండ్ డెత్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి జనన ధృవీకరణ పత్రాన్ని జారీ చేసినట్లు విచారణలో తేలిందని వివరించారు. విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం, అధికార దుర్వినియోగం, ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘనకు పాల్పడిన పంచాయతీ కార్యదర్శి పైనీ తిరుపతిని తక్షణమే సస్పెండ్ చేస్తూ, తదుపరి శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగిందని తెలిపారు. తప్పుడు నమోదు ప్రక్రియలో బాధ్యత వహించిన కంప్యూటర్ ఆపరేటర్ నీలేష్‌ను విధుల నుండి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘన, తప్పుడు ధృవీకరణ పత్రాల జారీ వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, గ్రామపంచాయతీలలో ప్రజలకు అందించే సేవలు పూర్తిగా పారదర్శకంగా, చట్టబద్ధంగా ఉండాలని, ప్రతి దరఖాస్తును సంబంధిత ఆధారాలు, రికార్డులను సమగ్రంగా పరిశీలించిన అనంతరమే పరిష్కరించాలని తెలిపారు.


# జైల్ భరోను జయప్రదం చేయాలి




**ఉద్యమ కెరటం, బెజ్జూర్:** క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈనెల 10న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సంయుక్త కార్యదర్శి వెలిశాల కృష్ణమాచారి పిలుపునిచ్చారు. శుక్రవారం బెజ్జూర్ గ్రామపంచాయతీ ఆవరణలో జైల్ భరో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తూ దేశ సంపదను ప్రైవేటీకరిస్తోందని విమర్శించారు. కార్మికులు, రైతులు, ప్రజలకు వ్యతిరేకంగా విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురావాలని చూస్తున్న నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను హరిస్తాయని, 'హైర్ అండ్ ఫైర్' విధానానికి చట్టబద్ధత కల్పిస్తాయని అన్నారు. 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచడం, సమ్మె హక్కుపై ఆంక్షలు విధించడం, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా వ్యవస్థలను బలహీనపర్చడం కార్మిక వర్గంపై దాడి చేయడమేనని పేర్కొన్నారు. ఉపాధిహామీ, ఆహార భద్రత పథకాల్లో కోతలు, విద్యుత్ రంగ ప్రైవేటీకరణను కూడా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. దేశ ప్రజల హక్కులు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ జైల్ భరో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సీఐటీయూ కన్వీనర్ గోరంట్ల వసంత్, శ్రీకాంత్, సలీం, శంకర్, రమేష్, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ నీటితో అధిక దిగుబడి పంటలపై దృష్టి సారించాలి





- రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ఎల్నినో ప్రభావంతో లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందునా రైతులు తక్కువ నీటి అవసరంతో అధిక దిగుబడి వచ్చే ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర నీటిపారుదల, ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్కుమార్ రెడ్డి సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వానాకాలం సాగు, వన మహోత్సవం, సమగ్ర వ్యవసాయ క్షేత్ర చెరువులు, స్మార్ట్ రేషన్ కార్డుల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరికి బదులుగా తక్కువ నీటి అవసరం ఉన్న ఆరుతడి పంటలను సాగు చేసేలా రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని, ప్రత్యామ్నాయ పంటలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 3 జిల్లాల్లో అధిక, 21 జిల్లాల్లో సాధారణ, 9 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. మండలాల వారీగా 126 మండలాల్లో అధిక, 282 మండలాల్లో సాధారణ, 205 మండలాల్లో లోటు, 8 మండలాల్లో భారీ లోటు వర్షపాతం నమోదైందన్నారు. భూగర్భ జలాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ సాగునీటి అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వానాకాలంలో రాష్ట్ర సాధారణ సాగు విస్తీర్ణం 1.32 కోట్ల ఎకరాలు కాగా, తుది సాగు విస్తీర్ణం 1.08 కోట్ల ఎకరాలుగా ఉందన్నారు. ఇప్పటి వరకు 99.81 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయని తెలిపారు. ఇందులో పత్తి 47.25 లక్షల ఎకరాలు, పప్పుధాన్యాలు 6.14 లక్షల ఎకరాలు, నూనెగింజలు 3.76 లక్షల ఎకరాలు, చెరుకు 38,149 ఎకరాలు, కూరగాయలు 43,802 ఎకరాల్లో సాగవుతున్నాయని వివరించారు. గోదావరి, కృష్ణా బేసిన్లలోని ప్రాజెక్టుల ద్వారా సాగునీటి విడుదలకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు.

### 16.06 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యం..

వన మహోత్సవంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 16.06 కోట్ల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇప్పటివరకు 6.28 కోట్ల మొక్కలు నాటడం, పంపిణీ చేయడం ద్వారా 39 శాతం ప్రగతి సాధించినట్లు మంత్రి తెలిపారు. నర్సరీల్లో 16.29 కోట్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నాటిన ప్రతి మొక్కను తప్పనిసరిగా టీజీఎఫ్ఎంఐఎస్ పోర్టల్లో జియో ట్యాగింగ్ చేసి, వాటి మనుగడ శాతాన్ని నిరంతరం నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న సమగ్ర వ్యవసాయ క్షేత్ర చెరువుల పనులను వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్రంలోని 31 జిల్లాల్లో 13,046 క్షేత్ర చెరువుల నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్దేశించామని, ఈనెల 15వ తేదీలోగా పనులన్నింటినీ ప్రారంభించి పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు.

### స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీపై ప్రత్యేక దృష్టి ..

పౌరసరఫరాల వ్యవస్థను మరింత పారదర్శకంగా, భద్రతాయుతంగా మార్చేందుకు తెలంగాణ స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం ప్రవేశపెడుతోందని తెలిపారు. డిజిటల్ సంతకం, హోలోగ్రామ్, వాటర్మార్క్, ఎన్క్రిప్టెడ్ క్యూ.ఆర్. కోడ్, యూవీ లోగో వంటి భద్రతా ఫీచర్లతో కార్డులను రూపొందించినట్లు చెప్పారు. మొత్తం 1 కోటి 6 లక్షల 20 వేల 92 రేషన్ కార్డుల ద్వారా 3 కోట్ల 42 లక్షల 57 వేల 109 మంది లబ్ధిదారులకు ప్రతినెల 2.16 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా 16 లక్షల 32 వేల 810 రేషన్ కార్డులు జారీ చేయడం జరిగిందని తెలిపారు. మంచిర్యాల జిల్లా నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శాంతారా మ్, జిల్లా అటవీ అధికారి కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్లు పి.చంద్రయ్య, వి.రాములు, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మొహమ్మద్ విలాయత్ అలీ తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ వానాకాలం సాగు, వన మహోత్సవం, పంట కుంటలు, స్మార్ట్ రేషన్ కార్డుల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పంటల మార్పు, ప్రత్యామ్నాయ పంటల సాగు, లోటు వర్షపాతంపై రైతులకు అవగాహన కల్పించాలని, శాఖల వారీగా నిర్దేశించిన వన మహోత్సవం లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేలా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంట కుంటల నిర్మాణం, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మద్యం, గుడుంబా నిషేధానికి చింతకర్ర గ్రామస్థుల ఏకగ్రీవ తీర్మానం



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని చింతకర్ర గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మద్యం, గుడుంబా తయారీ, విక్రయాలను పూర్తిగా నిషేధించాలని గ్రామస్థులు, గ్రామ పెద్దలు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. గ్రామంలో గుడుంబా తయారీ, విక్రయాలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న నేపథ్యంలో మద్యం రహిత, ప్రశాంతమైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గ్రామసభలో చేసిన తీర్మాన ప్రతిని గ్రామపంచాయతీ సర్పంచ్ జాధవ్ విఠల్, పంచాయతీ కార్యదర్శి బారిక్ రావుకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎవరూ గుడుంబా తయారు చేయడం, విక్రయించడం చేయవద్దని గ్రామ పెద్దలు సూచించారు. నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామంలో ప్రశాంతమైన, ఆరోగ్యకరమైన వాతావరణం నెలకొల్పేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యధోరావు, రాథోడ్ రావోజీ, ఆనంద్, గణేష్, గోవింద్, గాన్పత్, వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# పోక్సో చట్టం పై అవగాహన సదస్సు



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండలంలోని జెడ్పీహెచ్ఎస్ కుమారి, వడూర్, కేజీబీవీ నేరడిగొండ పాఠశాలల్లో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోక్సో చట్టం, లైంగిక వేధింపుల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీష్, మిషన్ శక్తి ఆర్థిక అక్షరాస్యత నిపుణుడు నిఖిల్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోక్సో చట్టం ఉద్దేశ్యం, బాల బాలికల ప్రాథమిక హక్కుల గురించి వివరించారు. లైంగిక వేధింపులను గుర్తించే విధానం, వాటి నుంచి ఎలా రక్షించుకోవాలనే దానిపై దిశానిర్దేశం చేశారు. విద్యార్థులకు ఎలాంటి వేధింపులు, ఇబ్బందులు ఎదురైనా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు, చైల్డ్ హెల్ప్లైన్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. పిల్లల భద్రత ప్రతిఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్లకు, ఇంటర్నెట్ కు దూరంగా ఉంటూ, చదువుపై శ్రద్ధ వహించాలని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు నిర్భయంగా విద్యను అభ్యసించాలని, పాఠశాలలో, బయట ఎలాంటి సమస్య ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ




**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** మండల కేంద్రంలోని రైతు వేదికలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, గుడిహత్నూర్ సర్పంచ్ ఆడే శీల ముఖ్య అతిథులుగా హాజరై మండలానికి చెందిన 48 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు అందజేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఆర్థిక భరోసాగా నిలుస్తున్నాయని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ నిఖిల్, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ స్వరూపరాణి అన్నారు. ద్వారకాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కత్తెర్ల గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముర్రుపాలతో శిశువు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. గర్భిణీలు పౌష్టిక ఆహారం తీసుకోవాలని సూచించారు. ఏడవ నెల నుంచి బిడ్డకు 29 నెలల వరకు బాలామృతం పెట్టాలని తెలిపారు. అనంతరం ద్వారకాపూర్ గ్రామ సర్పంచ్ మసాడి తిరుపతి ఆధ్వర్యంలో ఫ్రీ స్కూల్ పిల్లలందరికీ యూనిఫామ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు మహేశ్వరి, అమృత, తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

# బెజ్జూ ర్ అడవిలో కొండచిలువ దాడి.. మేక బలి




**ఉద్యమ కెరటం, బెజ్జూ ర్:** కొండచిలువ దాడిలో మేక మృతిచెందిన ఘటన బెజ్జూ ర్ రేంజ్ పరిధిలో చోటుచేసుకుంది. రోజువారీగా మేకలను తీసుకెళ్లిన మేకల కాపర్ల మందపై ఒక్కసారిగా కొండచిలువ పడింది. ఒక మేకను చుట్టేసి చంపింది. భయపడిన మేకల కాపర్లు కేకలు వేయడంతో సహచరులు వచ్చి శబ్దాలు చేయడంతో మేకను వదిలి పొదల్లోకి వెళ్లిపోయిందన్నారు. అనంతరం పరిశీలించగా మేక అప్పటికే మృతిచెందిందని తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో భయాందోళన నెలకొంది. అడవిలో వన్యప్రాణులు, విషసర్పాలు ఎక్కువగా సంచరిస్తుండడంతో పిల్లలు, మహిళలు ఒంటరిగా వెళ్లవద్దని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు. వన్యప్రాణులకు హాని కలిగిస్తే అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# సీఎంఆర్ బియ్యం డెలివరీ గడువులో పూర్తి చేయాలి

**జిల్లా అదనపు కలెక్ట ర్ రాములు**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జిల్లాలో సీఎంఆర్ బియ్యం డెలివరీలను వేగవంతం చేసి నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శుక్రవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ శ్రీకళ, ఎసి ఎస్ఓలతో కలిసి రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు, జిల్లాలో సీఎంఆర్ డెలివరీలలో వెనుకబడిన రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లక్ష్య సాధనలో వెనుకబడిన రైస్ మిల్లర్లు సీఎంఆర్ డెలివరీలను వేగవంతం చేయాలని, డెలివరీలలో ఎలాంటి జాప్యం లేకుండా సంబంధిత అధికారులు, మిల్లర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్ణీత గడువులోగా బియ్యం డెలివరీలను పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.<

# ఆదివాసి దినోత్సవ వేడుకలకు భారీ ఏర్పాట్లు

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఆదివాసీ సంఘాల నాయకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 9న ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ఉన్న హీరసుక్క టెంపుల్ ప్రాంగణంలో ఈ ప్రత్యేక కార్యక్రమం జరగనుంది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆదివాసీ సంఘ ప్రముఖ నాయకులు గేడం మనోహర్ , గేడం శ్రీధర్, గేడం మాధవ్, గేడం సురేష్, డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ బెజ్జంకి అనీల్ కుమార్, టౌన్ ప్రెసిడెంట్ ఖీజర్ పాషా, డీసీసీ జనరల్ సెక్రటరీ గౌలి సంజయ్, కౌన్సిలర్లు అర్బాజ్, జీషాన్, డీసీసీ సెక్రటరీ ఇమ్రాన్ బేగ్, 34వ వార్డు ప్రెసిడెంట్ జగదీశ్వర్ రెడ్డి, మహేందర్, రాధేశ్యాం, జాదవ్ శ్యామ్ నాయక్, గంగన్న లను ఆదివాసీ నాయకులు ఆహ్వానించారు.

# సింగరేణి అధికారులకు సన్మానం



**ఉద్యమ కెరటం, తాండూర్:** బెల్లంపల్లి ఏరియా గోలేటి జీఎం ఆఫీస్ లో శుక్రవారం ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సింగరేణి అధికారులను శాలువాలతో సన్మానించారు. జీఎం రమేష్, ఏజీఎం వీరన్న, డీజీఎం పర్సనల్ కిరణ్ బాబు, అలాగె ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ జాదవ్ సంజీవ్ లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ మంగీలాల్, కైరిగూడ మేనేజర్ జర్పులా శంకర్, వీరన్న, హరిసింగ్, కోటేశ్వరరావు, నరేష్, వరలక్ష్మి, భాగ్యలక్ష్మి, సౌందర్య, కల్పన, చిలుకు బాయి, అనురాధ, పద్మ తదితరులు పాల్గొన్నారు.


# అర్ధరాత్రి అనవసరంగా తిరిగితే కఠిన చర్యలు

**• ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి అనవసరంగా, అకారణంగా రోడ్లపై సంచరించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి హెచ్చరించారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు నేరాలు, దొంగతనాల అదుపునకు పట్టణంలో ప్రత్యేకంగా 'ఆపరేషన్ చబుత్ర' నిర్వహించినట్లు తెలిపారు. గురువారం రాత్రి ఆదిలాబాద్ వన్ టౌన్, టూటౌన్, మావల, రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు చెప్పారు. రాత్రి 12 గంటల తర్వాత కూడా అకారణంగా తిరుగుతున్న 134 మంది యువకులను అదుపులోకి తీసుకొని వన్టౌన్కు తరలించి కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందని, అనంతరం వారి తల్లిదండ్రులను పిలిపించి వారికి అప్పగించడం జరిగిందని తెలిపారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 20 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అనంతరం డిఎస్పీ మాట్లాడుతూ పట్టణంలోని వ్యాపార సముదాయాలు రాత్రి 10.30 గంటలకు మూసివేయాలని, ప్రజలు రాత్రి 11 గంటల లోపు ఇళ్లకు చేరుకోవాలని సూచించారు. ఎవరైనా గద్దెలు, హోటళ్ల ముందు, ప్రధాన కూడళ్ల వద్ద అనవసరంగా గుమిగూడితే సహించేది లేదన్నారు. ప్రజలకు ప్రశాంత వాతావరణం కల్పించడం, నేరాలను నియంత్రించడం, యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా కాపాడటమే ఈ ఆపరేషన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అలాగే అర్ధరాత్రి ప్రత్యేకంగా డ్రంక్ అండ్ డ్రైవ్, గంజాయి టెస్టులు కూడా నిర్వహిస్తున్నట్లు పేరొకనానరు. అత్యవసర పనులు, ఆసుపత్రులు, ఉద్యోగాలు, ప్రయాణాల నిమిత్తం తిరిగేవారు మినహా, నిబంధనలు ఉల్లంఘించి తిరిగే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ సునీల్ కుమార్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు టి.మురళి, ఎన్.చంద్రశేఖర్, ఎస్సైలు నాగనాథ్, అశోక్, ఆర్ఎస్సైలు గోపికృష్ణ, మనీష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జనగణన వివరాల సేకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి

**• రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళ్లికేరి**

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** జనగణన–2027 కార్యక్రమంలో భాగంగా జిల్లా జనగణన హ్యాండ్బుక్ తయారీకి అవసరమైన గ్రామ, పట్టణ డైరెక్టరీ వివరాల సేకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళ్లికేరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఇతర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత ప్రభుత్వ రిజిస్ట్రార్ జనరల్, జనగణన కమిషనర్ కార్యాలయం, తెలంగాణ రాష్ట్ర జనగణన సంచాలకుల కార్యాలయ మార్గదర్శకాల మేరకు అన్ని చార్జీల పరిధిలో ఫీల్డ్ ఫంక్షనరీలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాచార సేకరణ, నమోదు ప్రక్రియలో ఏకరూపత, ఖచ్చితత్వం, నాణ్యతను నిర్ధారించేలా సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలకు సంబంధించిన విద్య, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రహదారులు, రవాణా, బ్యాంకింగ్, పోస్టల్ సేవలు, వ్యవసాయం, మార్కెటింగ్ సౌకర్యాలు, సామాజిక, ఆర్థిక మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలకు సంబంధించిన సమగ్ర వివరాలను సేకరించి జిల్లా జనగణన హ్యాండ్బుక్ వెబ్ పోర్టల్లో నమోదు చేయాలని తెలిపారు. చార్జ్ అధికారులు ఫీల్డ్ సిబ్బందికి అవసరమైన సాంకేతిక సహకారం అందించడంతో పాటు వివిధ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ప్రతి గ్రామం, పట్టణానికి సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. నమోదు చేసే ప్రతి సమాచారం సంపూర్ణంగా, ఖచ్చితంగా, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. హ్యాండ్బుక్ పార్ట్–ఎలో గ్రామ, పట్టణ డైరెక్టరీలు, పార్ట్–బిలో ప్రాథమిక గణన సారాంశం ఉంటుందని తెలిపారు. మొబైల్ యాప్, వెబ్ పోర్టల్, అవసరమైతే భౌతిక షెడ్యూల్ ద్వారా సమాచార సేకరణ జరుగుతుందని వివరించారు. చార్జ్ అధికారుల బాధ్యతలు, ఫీల్డ్ సిబ్బంది నియామకం, యూజర్ ఐడీల సృష్టి, శిక్షణ, ఫీల్డ్ వర్క్ పర్యవేక్షణ, డేటా ధ్రువీకరణ, గౌరవ వేతనాల పంపిణీ తదితర అంశాలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. గ్రామ, పట్టణ కోడ్లను సక్రమంగా నమోదు చేయాలని, తప్పనిసరి వివరాలన్నింటినీ నమోదు చేయడంతో పాటు డూప్లికేట్ సమాచారం లేకుండా సంబంధిత శాఖల రికార్డులతో సరిపోలే విధంగా డేటాను నమోదు చేయాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి సహాయ వ్యవస్థ అందుబాటులో ఉంటుందని తెలిపారు. నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మొహమ్మద్ విలాయత్ అలీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ జనగణన హ్యాండ్బుక్ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల రూపకల్పన, మౌలిక వసతుల అభివృద్ధి, విధాన నిర్ణయాలు, పరిశోధనలకు ప్రామాణిక సమాచార గ్రంథంగా ఉపయోగపడుతుందని తెలిపారు. చార్జ్ అధికారులు, ఫీల్డ్ ఫంక్షనరీలు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి సమాచార సేకరణ, వెబ్ పోర్టల్లో నమోదు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల సామాజిక, ఆర్థిక, మౌలిక వసతులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా భవిష్యత్ ప్రణాళికాబద్ధ అభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేంద్ర రాథోడ్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, ముఖ్య ప్రణాళిక అధికారి, ఉప గణాంక అధికారి రాజేందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్, సక్సెషన్ ప్రక్రియను నిబంధనల మేరకు నిర్వహించాలి



**• జిల్లా అదనపు కలెక్ట ర్ ఆర్.ఎస్. చిత్రు**

**• భూ-భారతి సేవలపై జూనియర్ అసిస్టెంట్లకు శిక్షణ**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** భూ-భారతి పోర్టల్ ద్వారా ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలంటే సంబంధిత సిబ్బంది పూర్తి అవగాహనతో విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఆర్.ఎస్. చిత్రు సూచించారు. శుక్రవారం స్థానిక టీటీడీసీ సమావేశ మందిరంలో భూ-భారతి పోర్టల్కు సంబంధించిన అంశాలపై జూనియర్ అసిస్టెంట్లు, జీపీఓలు, టైపిస్టులు, సీనియర్ అసిస్టెంట్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. భూ-భారతి పోర్టల్లో దరఖాస్తుల నమోదు, పరిశీలన, రికార్డుల నిర్వహణ, రిజిస్ట్రేషన్, సక్సెషన్ తదితర ప్రక్రియలను ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను సకాలంలో పరిష్కరించి పారదర్శకంగా సేవలు అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ కలెక్టర్ వంశీకృష్ణారెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు పంచాపూల, కవిత భూ-భారతి పోర్టల్ నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన విధానం, రికార్డుల నిర్వహణ, సేవల అమలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి వివరించారు. అనంతరం టెక్నికల్ మేనేజర్లు విలాస్ వర్మ, ప్రశాంత్, రఘుపతిరెడ్డి రిజిస్ట్రేషన్, సక్సెషన్ ప్రక్రియలకు సంబంధించిన సాంకేతిక అంశాలను ప్రదర్శన ద్వారా తెలియజేశారు. పోర్టల్లో దరఖాస్తుల నమోదు, పరిశీలన, ఆమోద ప్రక్రియ, సాంకేతిక సమస్యల పరిష్కార విధానాలపై సిబ్బందికి శిక్షణ అందించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టా లి

- **సర్వసభ్య సమావేశంలో సర్పంచుల డిమాండ్**




**ఉద్యమ కెరటం, కెరమెరి:** గ్రామాల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సర్పంచులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాల సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనులపై విస్తృత చర్చ నిర్వహించారు. వివిధ గ్రామాల సర్పంచులు తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు ప్రమాదాలకు కారణమవుతున్నాయని, చెడిపోయిన ట్రాన్స్ఫార్మర్లను వెంటనే మార్చి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అత్యవసర చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇందాపూర్ సర్పంచ్ బుచ్చయ్య మాట్లాడుతూ తమ గ్రామానికి ఇప్పటి వరకు ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో అర్హులైన పేద కుటుంబాలు అధిక సంఖ్యలో ఉన్నారని, వారికి వెంటనే ఇండ్లు మంజూరు చేయాలని గ్రంథాలయ చైర్మన్ అనిల్ కుమార్ను కోరారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార వివరాలను స్పష్టంగా తెలియజేసేలా చార్ట్ బోర్డులు ఏర్పాటు చేసి, ప్రతిరోజు అందించే ఆహార వివరాలను ప్రదర్శించాలని, ఆ వివరాలను గ్రామ సర్పంచులకు కూడా అందుబాటులో ఉంచాలని కోరారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రుణాలు, ఉపాధి అవకాశాలపై మహిళలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి, వాటి ప్రయోజనాలను వివరించాలని తెలిపారు. పరండోలి సర్పంచ్ మాట్లాడుతూ తమ గ్రామానికి ఇప్పటివరకు ఒక్క ఇందిరమ్మ ఇల్లు మాత్రమే మంజూరైందని, ఇంకా అనేక మంది పేదలు గృహాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. గ్రామాల సమస్యలను పరిష్కరించేందుకు సమావేశం నిర్వహించిన గ్రంథాలయ చైర్మన్ అనిల్ కుమార్ను సర్పంచులు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా కెరమెరి ఎస్సై మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రధాన కూడళ్లలో వీలైనంత మేర సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. తహశీల్దార్ మాట్లాడుతూ మండల రెవెన్యూ కార్యాలయానికి రూ.2.25 కోట్ల వ్యయంతో నూతన భవనం నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, త్వరలో భూమిపూజ నిర్వహించి పనులు ప్రారంభిస్తామని వివరించారు. అలాగే మహారాష్ట్ర–తెలంగాణ సరిహద్దు గ్రామాల ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో సర్పంచులు అందించిన సహకారం అభినందనీయమని వారికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.



# నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

- **జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**
- **ప్రజలకు చేరువగా 'పోలీసులు మీకోసం'**
- **వాగ్దారిలో ఉచిత వైద్య శిబిరం.. 12 సీసీ కెమెరాలు ప్రారంభం**






**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పోలీసు–ప్రజల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేసేందుకు శుక్రవారం మండలంలోని వాగ్దారి గ్రామంలో 'పోలీసులు మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎస్పీ సందర్శించారు. ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యుల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 800 మందికి ఆర్థోపెడిక్, డెంటల్, పీడియాట్రిక్, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ తదితర విభాగాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా వైద్య సలహాలు అందించారు. ప్రజారోగ్య పరిరక్షణకు ఇలాంటి శిబిరాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. నేరడిగొండ మండల కేంద్రం, తర్ణం గ్రామాల్లో ఏర్పాటు చేసిన 12 సీసీ కెమెరాలను ప్రారంభించారు. గ్రామాలు సీసీటీవీ నిఘాలో ఉంటే నేరాల నియంత్రణతో పాటు నేరస్థులను త్వరగా గుర్తించి చర్యలు తీసుకోవడం సులభమవుతుందని పేర్కొన్నారు. గ్రామ భద్రతలో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్పీ సూచించారు. ప్రమాదాల నివారణలో ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. నిబంధనలు పాటిస్తున్న 20 మంది వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేసి అభినందించారు. గంజాయి, గుడుంబా వంటి మాదక వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి సాగు, నిల్వ, రవాణా, విక్రయం, వినియోగం చట్టరీత్యా తీవ్రమైన నేరాలని హెచ్చరించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. మహిళలు వేధింపులు, ఇతర సమస్యలు ఎదురైనప్పుడు షీటీం హెల్ప్లైన్ 8712659953ను సంప్రదించాలని తెలిపారు. మండలంలోని అసాంఘిక కార్యకలాపాలపై 8712659973 వాట్సాప్ నంబర్కు సమాచారం అందించవచ్చని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ఫైనల్లో వాగ్దారి జట్టు విజేతగా, మాదాపూర్ జట్టు రన్నరప్గా నిలిచాయి. విజేతలకు ఎస్పీ నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. పెయింటింగ్ పోటీల్లో విజేతలైన చిన్నారులకు కూడా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్.రమేష్, నేరడిగొండ ఎస్సై ఇమ్రాన్, వాగ్దారి సర్పంచ్ జాదవ్ విజయ్కుమార్, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, మహిళలు, యువత, చిన్నారులు, వైద్యులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 10న మర్లపాడులో రహదారుల దిగ్బంధనం

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సీఐటీయూ, ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 10న మర్లపాడు గ్రామ సెంటర్లో నిర్వహించనున్న రహదారుల దిగ్బంధనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మర్లపాడు గ్రామంలోని ఆల్ హమాలీ కార్మికుల అడ్డా వద్ద జరిగిన సమావేశంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తూ లేబర్ కోడ్లను అమలు చేస్తోందని విమర్శించారు. రైతాంగానికి వ్యతిరేకంగా విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చి వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తోందని ఆరోపించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరచడం ద్వారా గ్రామీణ పేదల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో 10న నిర్వహించనున్న జైల్ భరో, రహదారుల దిగ్బంధనం కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్రావు మాట్లాడుతూ దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా మారిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో గజ్జెల్లి సత్యనారాయణ, గజ్జెల్లి వెంకటేశ్వరరావు, కనమాల నాగరాజు, దారా నాగరాజు, నడ్డి ప్రసాద్, నడ్డి వెంకటేశ్వరరావు, దారా శ్రీను, యామవరపు శ్రీను, పూరేటి శ్రీను, కనపర్తి కృష్ణ, వేము రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుడి తీరుపై అసహనం

- **వైద్య సేవలపై ఆరా తీసిన గ్రంథాలయ చైర్మన్ అనిల్కుమార్**





**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యుడి తీరుపై గ్రంథాలయ చైర్మన్ కాండే అనిల్కుమార్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆస్పత్రిని సందర్శించిన ఆయన వైద్య సేవలు, సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. హాజరు పట్టికను పరిశీలించగా, ఆ సమయంలో ఒక్క స్టాఫ్ నర్స్ మాత్రమే విధుల్లో ఉన్నట్లు గుర్తించారు. వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండే తీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీఎం జన్మన్ పథకంలో భాగంగా నియమితులైన డాక్టర్లు రియాన్, ఆసిమ్ ఆస్పత్రితో పాటు మండలంలోని సబ్సెంటర్లలో వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ రియాన్ చైర్మన్కు వివరించినట్లు తెలిపారు. తాను ఇతర సబ్సెంటర్లను సందర్శించే సమయంలో డాక్టర్ ఆసిమ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇదే క్రమంలో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశానికి హాజరైన అనంతరం డాక్టర్ రియాన్ గోయగాం సబ్సెంటర్లో విధుల్లో ఉన్నట్లు తెలిపారు. ఆస్పత్రిలో రికార్డులు, సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలిస్తున్న సమయంలో డాక్టర్ ఆసిమ్ అక్కడికి వచ్చి పట్టించుకోకుండా వెళ్లిపోయారని చైర్మన్ వర్గీయులు తెలిపారు. అనంతరం ఆస్పత్రి సిబ్బంది ద్వారా ఆయనను తిరిగి పిలిపించినట్లు పేర్కొన్నారు. తాను గ్రంథాలయ చైర్మన్గా పరిచయం చేసుకున్నప్పటికీ వైద్యుడు స్పందించలేదని తెలిపారు. వైద్య సేవలు, సిబ్బంది వివరాలపై చైర్మన్ ఆరా తీసిన సమయంలో డాక్టర్ ఆసిమ్ దురుసుగా సమాధానం ఇచ్చారని, 'నువ్వెవరు.. ఆస్పత్రిలో నీకేం పని.. నీకు హక్కు లేదు' అంటూ ప్రశ్నించినట్లు చైర్మన్ వర్గీయులు ఆరోపించారు. వైద్య సేవలకు సంబంధించిన వివరాలు చెప్పాలని కోరినా స్పందించకుండా ఎదురు ప్రశ్నలు వేశారని తెలిపారు. ఈ ఘటనపై అనిల్కుమార్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల్లోని గిరిజన, పేద ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన వైద్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సి ఉందన్నారు. ప్రజాప్రతినిధి హోదాలో ఉన్న తనతో దురుసుగా మాట్లాడటం సరికాదని పేర్కొన్నారు. వైద్య సేవలు, సిబ్బంది వివరాలు అడిగినందుకు సమాధానం ఇవ్వకపోవడంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పేద, గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ఉన్న నేపథ్యంలో.. వైద్యుడి తీరుపై అధికారులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సుజాయిత్ ఖాన్, తుమ్మగూడ సర్పంచ్ కుంరం భీంరావు, దేవాపూర్ సర్పంచ్ అమూల్, ఉప సర్పంచ్ వాగ్మారె శ్రీకాంత్, మాజీ సర్పంచ్ జగన్నాథ్ రావు, తిరుపతి, రమేష్, రాథోడ్ దేవిదాస్ తదితరులు ఉన్నారు.

## పాము కాటుతో మహిళ మృతి

**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** మండలంలోని తోషం గ్రామ పరిధిలో పాము కాటుకు గురై ముడిముడుగుల రాజలక్ష్మి(53) అనే మహిళ మృతిచెందినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసులు, మృతురాలి భర్త తెలిపిన వివరాల ప్రకారం.. తోషం గ్రామానికి చెందిన ముడిముడుగుల మాణిక్యరావు భార్య రాజలక్ష్మి గురువారం ఉదయం 6.30గంటల సమయంలో ఇంట్లో పనులు చేసుకుంటుండగా ఆమెను పాము కాటువేసింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం వెంటనే ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి అదేరోజు సాయంత్రం మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతురాలి భర్త మాణిక్యరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## జన్మదినం సందర్భంగా సేవా కార్యక్రమాలు





**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణ మున్సిపల్ మాజీ చైర్మన్, సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు కూసంపూడి మహేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు చాంద్ పాషా, అద్దంకి అనిల్, వల్లభనేని పవన్, పర్వతనేని వేణు ఆధ్వర్యంలో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వద్ద, ప్రధాన రోడ్డులోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోగులు, వారి సహాయకులు, ప్రజలకు ఉచితంగా అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూసంపూడి మహేష్ సేవా దృక్పథాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని తెలిపారు. మహేష్కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మిద్దె శ్రీను, షేక్ బాబు, అప్పు, లయన్స్ క్లబ్ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జైల్ భరో కార్యక్రమంలో ఆశా వర్కర్లు



**ఉద్యమ కెరటం, తాండూర్:** కార్మిక సంఘాలు, ఎస్కేఎం పిలుపు మేరకు నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమంలో ఆశా వర్కర్లు పాల్గొంటారని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ నాయకులు తెలిపారు. శుక్రవారం తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె. జయమేరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజారాం, డీవైఎఫ్ఐ కార్యదర్శి బొల్లం రాజేశం మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులపై దాడి చేస్తూ యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లను అమలు చేసిందని ఆరోపించారు. లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో మార్పులతో వ్యవసాయ కార్మికుల ఉపాధి దెబ్బతింటుందని, నూతన విద్యా విధానం విద్యారంగ కార్పొరేటీకరణకు దారితీస్తుందని విమర్శించారు. విద్యుత్ సవరణ బిల్లుతో వినియోగదారులపై భారం పెరగడంతో పాటు ప్రభుత్వ విద్యుత్ రంగం ప్రైవేటీకరణకు దారితీస్తుందని అన్నారు. రైతులు గిట్టుబాటు ధర తదితర సమస్యలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ తారాబాయి, ఏఎన్ఎంలు వైజాగ్, స్రవంతి, పద్మ, నవత, తిరుపతమ్మ, సావిత్రి, ఆశా వర్కర్లు, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు జైనూర్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ సబ్స్టేషన్లో నెలవారీ నిర్వహణ, మరమ్మతు పనులు చేపట్టనుండడంతో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ లచ్చన్న తెలిపారు. సబ్స్టేషన్లోని ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ లైన్లలో ఉన్న సాంకేతిక లోపాలతో పాటు ఇతర మరమ్మతు పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జైనూర్ మండల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# లంక బ్యాటర్ల దంచికొట్టుడు




- ప్రాక్టీస్ మ్యాచ్‌లో టీమిండియా బౌలర్లకు చుక్కలు
- తొలి రోజే 363 పరుగులతో ఆతిథ్య జట్టు పట్టు
- ముగ్గురి అర్ధశతకాలు.. తొలి వికెట్‌కు 110 పరుగులు
- స్పిన్నర్లకు తలో రెండు వికెట్లు.. సుథార్ పొదుపైన బౌలింగ్
- గాయం కారణంగా బరిలోకి దిగని కెప్టెన్ గిల్

**కొలంబో, ఆగస్టు 7:** టెస్టు సిరీస్‌కు ముందు టీమిండియాకు శ్రీలంక ఎలెవన్ బ్యాటర్లు గట్టి హెచ్చరికలే పంపారు. మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌లో తొలి రోజే భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న శ్రీలంక ఎలెవన్ ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 363 పరుగులు చేసింది. ఓపెనర్లు రవిందు రసంత, నిషాన్ మదుష్కతో పాటు కెప్టెన్ సోనాల్ అర్ధశతకాలతో చెలరేగడంతో భారత బౌలర్లు పరుగుల ప్రవాహాన్ని కట్టడి చేయలేకపోయారు.

### ఓపెనర్ల నుంచే ఎదురుదాడి

శ్రీలంకకు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. రవిందు రసంత, నిషాన్ మదుష్క భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ తొలి వికెట్‌కు 110 పరుగుల భారీ భాగస్వామ్యం నమోదు చేశారు. రసంత 143 బంతుల్లో 71 పరుగులు చేయగా, మదుష్క 66 పరుగులతో రాణించారు. అనంతరం కెప్టెన్ సోనాల్ 51 పరుగులతో జట్టును భారీ స్కోరు దిశగా నడిపించాడు. భారత బౌలర్లలో మానవ్ సుథార్ ఆకట్టుకున్నాడు. 13 ఓవర్లలో కేవలం 33 పరుగులిచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ కూడా చెరో రెండు వికెట్లు దక్కించుకున్నారు. గుర్నూర్ బ్రార్‌కు ఒక వికెట్ లభించింది. అయినప్పటికీ లంక బ్యాటర్లను తక్కువ స్కోరుకు కట్టడి చేయడంలో భారత బౌలర్లు విఫలమయ్యారు.

### గిల్‌కు విశ్రాంతి

ప్రాక్టీస్ సెషన్‌లో కుడిచేతి వేలికి గాయమైన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలి రోజు ఆటకు దూరంగా ఉన్నాడు. దీంతో కేఎల్ రాహుల్ తాత్కాలికంగా జట్టు బాధ్యతలు చేపట్టాడు. గిల్ గాయాన్ని భారత క్రికెట్ నియంత్రణ మండలి వైద్య బృందం పర్యవేక్షిస్తోంది.

### పిచ్‌పై భారత్ అసంతృప్తి!

ప్రాక్టీస్ మ్యాచ్‌కు సిద్ధం చేసిన పిచ్‌పైనా భారత జట్టు యాజమాన్యం అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. సాధారణంగా శ్రీలంక పిచ్‌లు స్పిన్‌కు అనుకూలంగా ఉంటాయి. అయితే ఈ మ్యాచ్ పిచ్‌పై ఎక్కువ గడ్డి ఉండటంతో స్పిన్నర్లకు ఆశించిన సహకారం లభించలేదు. ప్రధాన టెస్టుల్లో స్పిన్‌కు అనుకూలమైన పిచ్‌లు ఎదురయ్యే అవకాశముండగా, సన్నాహక మ్యాచ్‌కు భిన్నమైన పిచ్ ఇవ్వడం వల్ల ఆశించిన ప్రయోజనం దక్కదని భారత జట్టు భావిస్తోంది. రెండు టెస్టుల సిరీస్‌కు ముందు సరైన బౌలింగ్ కూర్పును నిర్ణయించుకోవడంతో పాటు స్థానిక పరిస్థితులకు అలవాటుపడేందుకు ఈ మూడు రోజుల మ్యాచ్ టీమిండియాకు కీలకంగా మారింది.

# కోహ్లీ అండతోనే నా పంచ్‌కు పదును!

- కష్టకాలంలో మూడేళ్లు అండగా నిలిచిన విరాట్
- ఆర్థిక భరోసాతో ఆటపైనే పూర్తిగా దృష్టి
- ఆయన క్రమశిక్షణే నాకు స్ఫూర్తి: సాక్షి చౌదరి
- కామన్వెల్త్ స్వర్ణ విజేత భావోద్వేగ వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** బాక్సింగ్ రింగ్‌లో ప్రత్యర్థులపై పంచ్‌ల వర్షం కురిపించి కామన్వెల్త్ క్రీడల్లో భారత్‌కు స్వర్ణ పతకం అందించిన సాక్షి చౌదరి తన విజయ ప్రయాణం వెనుక ఉన్న ఆసక్తికర విషయాన్ని వెల్లడించింది. టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తన కెరీర్‌లో అత్యంత క్లిష్ట సమయంలో అండగా నిలిచారని తెలిపింది. దాదాపు మూడేళ్లపాటు ఆయన అందించిన ఆర్థిక సహకారం వల్ల ఇతర సమస్యల గురించి ఆలోచించకుండా పూర్తిగా ఆటపైనే దృష్టి పెట్టగలిగానని భావోద్వేగానికి గురైంది. ఐఎన్ఎస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సాక్షి చౌదరి మాట్లాడుతూ విరాట్ కోహ్లీ తనకు ఆదర్శమని పేర్కొంది. కెరీర్‌లో ముందుకు వెళ్లేందుకు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదురవుతున్న సమయంలో కోహ్లీ, ఆయన ఫౌండేషన్ తనకు అండగా నిలిచాయని తెలిపింది. దాదాపు మూడేళ్లపాటు స్పాన్సర్‌గా వ్యవహరించడం తన కెరీర్‌కు ఎంతో ఉపయోగపడిందని చెప్పింది. ఆ సహకారం వల్ల శిక్షణ, పోటీలపై పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించగలిగానని సాక్షి వివరించింది. తన ప్రయాణంలో కోహ్లీ అందించిన మద్దతును ఎప్పటికీ మరిచిపోలేనని, జీవితాంతం ఆయనకు కృతజ్ఞురాలిగా ఉంటానని పేర్కొంది. మైదానంలో విరాట్ కోహ్లీ చూపించే క్రమశిక్షణ, నిలకడ తనను ఎంతగానో ప్రభావితం చేశాయని సాక్షి తెలిపింది. ఒత్తిడి ఎంత ఉన్నా లక్ష్యంపై దృష్టి కోల్పోకుండా ముందుకు సాగే కోహ్లీ తీరు తనకు స్ఫూర్తినిస్తుందని చెప్పింది. ఆయన నుంచి లభించిన మద్దతు తనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందని, అంతర్జాతీయ స్థాయిలో మరింత మెరుగైన ప్రదర్శన చేసేందుకు దోహదపడిందని పేర్కొంది. స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో జరిగిన 2026 కామన్వెల్త్ క్రీడల్లో మహిళల 51 కిలోల విభాగంలో సాక్షి చౌదరి స్వర్ణ పతకం సాధించింది. ఫైనల్లో ఇంగ్లాండ్ బాక్సర్ రూబీ వైట్‌ను ఓడించి అగ్రస్థానంలో నిలిచింది. ఈ విజయంతో భారత బాక్సింగ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. సాక్షి వ్యాఖ్యలతో కోహ్లీ ప్రోత్సాహం క్రికెట్‌కే పరిమితం కాకుండా ఇతర క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న యువ క్రీడాకారుల ప్రయాణానికీ అండగా నిలుస్తోందన్న విషయం మరోసారి వెలుగులోకి వచ్చింది.

# శ్రేయస్‌కు 'మిస్టర్ కూల్ 2.0' కితాబు

- ధోనీ తర్వాత అంతటి 'కూల్' కెప్టెన్ అయ్యరే!
- ఓటముల్లోనూ ప్రశాంతతే అతడి అసలైన బలం
- యువ ఆటగాళ్లపై ఒత్తిడి కాదు.. పూర్తి స్వేచ్ఛ
- అరుపులు.. కేకలు ఉండవు.. అండగా నిలిచే నాయకత్వం
- అయ్యర్ కెప్టెన్సీపై ఆకాశ్ చోప్రా ప్రశంసల జల్లు




**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** భారత క్రికెట్‌లో 'కెప్టెన్ కూల్' అనగానే గుర్తుకొచ్చే పేరు మహేంద్రసింగ్ ధోనీ. ఎంతటి ఉత్కంఠభరిత పరిస్థితుల్లోనైనా ముఖంలో భావోద్వేగాలు కనిపించనివ్వకుండా జట్టును నడిపించడం ధోనీ ప్రత్యేకత. ఇప్పుడు అదే తరహా ప్రశాంతత శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలోనూ కనిపిస్తోందని మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా ప్రశంసించాడు. ధోనీ తర్వాత అంతటి కూల్ కెప్టెన్‌గా అయ్యర్ కనిపిస్తున్నాడంటూ కితాబిచ్చాడు. భారత టీ20 జట్టు నాయకుడిగా శ్రేయస్ అయ్యర్ ప్రశాంతత, సానుకూల దృక్పథమే అతడి కెప్టెన్సీని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయని చోప్రా పేర్కొన్నాడు. జూన్ 2026లో సూర్యకుమార్ యాదవ్ నుంచి భారత టీ20 కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించిన అయ్యర్‌కు ఆరంభంలో ఆశించిన ఫలితాలు దక్కలేదు. నాయకత్వం చేపట్టిన తొలి తొమ్మిది మ్యాచ్‌ల్లో భారత్ కేవలం రెండు విజయాలే సాధించింది. అయినప్పటికీ జట్టులో ప్రతికూల వాతావరణం ఏర్పడకుండా ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసం నింపడంలో అయ్యర్ పరిణతి చూపిస్తున్నాడని వివరించాడు. 'ది గ్రేట్ ఇండియన్ క్రికెట్ షో' కార్యక్రమంలో ఆకాశ్ చోప్రా మాట్లాడుతూ.. అయ్యర్ నోటి నుంచి సాధారణంగా ప్రతికూల వ్యాఖ్యలు రావని చెప్పాడు. మనం మాట్లాడే మాటలకు కూడా ప్రభావం ఉంటుందని, సానుకూలంగా ఆలోచిస్తే మంచి ఫలితాలు వస్తాయనే భావనను అయ్యర్ బలంగా నమ్ముతాడని పేర్కొన్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఆటగాళ్లపై సహజంగానే తీవ్ర ఒత్తిడి ఉంటుందని, అలాంటి సమయంలో కెప్టెన్ లేదా కోచ్ మరింత ఒత్తిడి పెంచకుండా వారిని ప్రశాంతంగా ఉంచడం అత్యంత ముఖ్యమని చోప్రా అభిప్రాయపడ్డాడు. యువ ఆటగాళ్లకు పూర్తి స్వేచ్ఛనిస్తూ వారిలోని అత్యుత్తమ ఆటను బయటకు తీసుకురావడానికి అయ్యర్ ప్రయత్నిస్తున్నాడని ప్రశంసించాడు. మైదానంలో నిరంతరం అరవడం, ఆటగాళ్లపై అసహనం ప్రదర్శించడం కాకుండా తప్పులు చేసినా వారికి అండగా నిలిచే నాయకుడినే యువ క్రికెటర్లు కోరుకుంటారని చోప్రా పేర్కొన్నాడు. శ్రేయస్ అయ్యర్ సరిగ్గా అలాంటి నాయకుడేనని వ్యాఖ్యానించాడు. విజయాలు వెంటనే రాకపోయినా అయ్యర్ అనుసరిస్తున్న ప్రశాంతమైన నాయకత్వ విధానం దీర్ఘకాలంలో భారత జట్టుకు మేలు చేస్తుందని చోప్రా అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా యువ ఆటగాళ్ల మానసిక స్థైర్యాన్ని పెంచడంలో అతడి విధానం కీలకంగా మారుతుందన్నాడు. ఒత్తిడిలోనూ ధోనీ ఎంత ప్రశాంతంగా కనిపించేవాడో, అయ్యర్‌లోనూ అలాంటి లక్షణాలే కనిపిస్తున్నాయని పేర్కొంటూ.. భారత క్రికెట్‌కు మరో 'మిస్టర్ కూల్' దొరికినట్లేనని ప్రశంసించాడు.



# రిటైర్మెంట్ రోజే స్టీవ్ వా ఫోన్!

### రహానే కెరీర్‌కు ఊహించని కొత్త మలుపు
### ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ నుంచి ఆడేందుకు గ్రీన్‌సిగ్నల్
### పరుగుల కోసమే కాదు.. యువ ఆటగాళ్లకు మార్గదర్శకత్వమే లక్ష్యం
### ఆగస్టు 26 నుంచి యూరప్‌లో కొత్త ఇన్నింగ్స్

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన రోజే భారత మాజీ టెస్టు కెప్టెన్ అజింక్య రహానేకు ఊహించని అవకాశం తలుపుతట్టింది. ఆస్ట్రేలియా దిగ్గజ కెప్టెన్ స్టీవ్ వా నుంచి వచ్చిన ఒక్క ఫోన్ కాల్ రహానే క్రికెట్ ప్రయాణానికి కొత్త మలుపు ఇచ్చింది. యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్‌లో ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ తరఫున బరిలోకి దిగేందుకు రహానే సిద్ధమయ్యాడు. తాను రిటైర్మెంట్ ప్రకటించిన రోజే స్టీవ్ వా స్వయంగా ఫోన్ చేసి ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్‌లో చేరాలని ఆహ్వానించినట్లు రహానే వెల్లడించాడు. ఆ ప్రతిపాదనపై ఒక రోజు ఆలోచించిన తర్వాత అంగీకరించినట్లు తెలిపాడు. మరో టీ20 లీగ్‌లో ఆడే అవకాశంగా మాత్రమే కాకుండా తన సుదీర్ఘ అంతర్జాతీయ అనుభవాన్ని యువ క్రికెటర్లతో పంచుకునే వేదికగా దీనిని చూస్తున్నట్లు చెప్పాడు.

### పరుగులే కాదు.. అనుభవం పంచేందుకూ

38 ఏళ్ల రహానే తాను యూరప్‌కు కేవలం పరుగులు చేసేందుకు మాత్రమే వెళ్లడం లేదని స్పష్టం చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో ఎన్నో ఏళ్లుగా సంపాదించిన అనుభవాన్ని యువ ఆటగాళ్లకు అందించడం, వారికి మార్గదర్శకుడిగా నిలవడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నాడు. తన ప్రయాణంలో నేర్చుకున్న విషయాలు కొత్త తరానికి ఉపయోగపడితే అదే తనకు గొప్ప సంతృప్తి అని తెలిపాడు. ఐర్లాండ్, నెదర్లాండ్స్ వంటి జట్లు అంతర్జాతీయ క్రికెట్‌లో క్రమంగా మెరుగైన ప్రదర్శన చేస్తున్నాయని రహానే పేర్కొన్నాడు. అక్కడి యువ ఆటగాళ్లలో నేర్చుకోవాలనే తపన కనిపిస్తోందని చెప్పాడు. యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ స్థానిక ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేసే వేదికగా మారుతుందని అభిప్రాయపడ్డాడు. అంతర్జాతీయ స్టార్ ఆటగాళ్లతో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోవడం ద్వారా స్థానిక క్రికెటర్లు వేగంగా ఎదిగే అవకాశం ఉంటుందని వివరించాడు.

### రహానేపై స్టీవ్ వా ప్రశంసలు

ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ సహ యజమాని, చీఫ్ క్రికెట్ ఆఫీసర్ స్టీవ్ వా కూడా రహానేపై ప్రశంసలు కురిపించాడు. రహానే ఆదర్శవంతమైన ప్రొఫెషనల్ క్రికెటర్ అని, అతనిలో నైపుణ్యం, సహనం, నాయకత్వ లక్షణాలతో పాటు వినయం కూడా ఉన్నాయని కొనియాడాడు. తీవ్రమైన ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఉండే రహానే స్వభావం జట్టుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నాడు. ఫ్రాంచైజీ సీఈవో టిమ్ థామస్ సైతం రహానే చేరికను క్లబ్ చరిత్రలో కీలక ఘట్టంగా అభివర్ణించాడు. ఇది కేవలం ఒక స్టార్ ఆటగాడిని జట్టులోకి తీసుకోవడం మాత్రమే కాదని, భవిష్యత్తులో జట్టు సంస్కృతి, ప్రమాణాలను నిర్మించడంలో ఉపయోగపడే కీలక నిర్ణయమని పేర్కొన్నాడు.

### ఆగస్టు 26 నుంచి కొత్త ఇన్నింగ్స్

యూరోపియన్ టీ20 ప్రీమియర్ లీగ్ ఆగస్టు 26 నుంచి సెప్టెంబర్ 20 వరకు జరగనుంది. ఐర్లాండ్‌లోని డబ్లిన్, నెదర్లాండ్స్‌లోని ది హేగ్ నగరాలు మ్యాచ్‌లకు వేదిక కానున్నాయి. ఆమ్‌స్టర్‌డామ్ ఫ్లేమ్స్ తరఫున రహానే బరిలోకి దిగనున్నాడు. అతని సుదీర్ఘ అంతర్జాతీయ అనుభవం జట్టుకు అదనపు బలంగా మారుతుందని ఫ్రాంచైజీ భావిస్తోంది.

### 195 మ్యాచ్‌లు.. 8,414 పరుగులు

భారత్ తరఫున రహానే 85 టెస్టులు, 90 వన్డేలు, 20 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడాడు. మూడు ఫార్మాట్లలో కలిపి 195 మ్యాచ్‌ల్లో 8,414 పరుగులు సాధించాడు. అతని ఖాతాలో 15 సెంచరీలు, 51 అర్ధ సెంచరీలు ఉన్నాయి. జూలై 30న అంతర్జాతీయ క్రికెట్‌తో పాటు భారత దేశీయ క్రికెట్‌కు కూడా వీడ్కోలు పలికిన రహానేకు ఇప్పుడు విదేశీ ఫ్రాంచైజీ లీగ్‌లలో కొత్త ప్రయాణం మొదలవుతోంది. భారత జెర్సీలో సుదీర్ఘ ఇన్నింగ్స్ ముగించిన రహానే.. ఇప్పుడు యూరప్ గడ్డపై ఎలాంటి ముద్ర వేస్తాడన్నది ఆసక్తికరంగా మారింది.



# ‘బిగ్‌బాస్’లో సాధనా నాయుడు!?

### పదో సీజన్‌లో సోషల్ మీడియా బ్యూటీ సందడి?

### హౌస్‌లోకి ఎంట్రీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందంటూ ప్రచారం

### పేరు బయటకు రావడంతో నెట్టింట పెరిగిన ఆసక్తి

### ‘దశావతారం’ కాన్సెప్ట్‌తో పదింతల వినోదానికి రంగం సిద్ధం

బుల్లితెర బిగ్గెస్ట్ రియాలిటీ షోగా ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ‘బిగ్‌బాస్’ పదో సీజన్‌కు సిద్ధమవుతోంది. ఇప్పటికే తొమ్మిది సీజన్లను పూర్తి చేసుకున్న ఈ కార్యక్రమం ఇప్పుడు ‘బిగ్‌బాస్ 10: దశావతారం’ పేరుతో ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొత్త సీజన్‌లో పాల్గొనే కంటెస్టెంట్లపై రోజుకో పేరు తెరపైకి వస్తుండగా తాజాగా సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ సాధనా నాయుడు పేరు జోరుగా వినిపిస్తోంది.

**సాధనా ఎంట్రీ ఖాయమేనా?**

బిగ్‌బాస్ పదో సీజన్ కోసం నిర్వాహకులు సాధనా నాయుడిని సంప్రదించారని, ఆమె కూడా హౌస్‌లోకి వెళ్లేందుకు సానుకూలంగా స్పందించిందనే ప్రచారం సామాజిక మాధ్యమాల్లో సాగుతోంది. అయితే ఆమె ఎంపికపై నిర్వాహకుల నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. సాధనా నాయుడు సామాజిక మాధ్యమాల్లో తనదైన కంటెంట్‌తో గుర్తింపు తెచ్చుకున్నారు. ఫ్యాషన్, బ్యూటీ, లైఫ్‌స్టైల్, ట్రావెల్‌తో పాటు రోజువారీ జీవితానికి సంబంధించిన వీడియోలు, ఫొటోలతో నెటిజన్లను ఆకట్టుకుంటున్నారు. ట్రెండింగ్ రీల్స్, స్టైలిష్ ఫొటోషూట్లతో డిజిటల్ వేదికల్లో తనకంటూ ప్రత్యేక ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నారు.

**నెట్టింట ఒక్కసారిగా క్రేజ్**

బిగ్‌బాస్ కంటెస్టెంట్‌గా సాధనా నాయుడు పేరు ప్రచారంలోకి రావడంతో ఆమె సామాజిక మాధ్యమ ఖాతాలపై నెటిజన్ల ఆసక్తి పెరిగింది. ఆమె హౌస్‌లోకి అడుగుపెడితే తనదైన స్టైల్, వ్యక్తిత్వంతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారంటూ అభిమానులు చర్చించుకుంటున్నారు. ప్రతి సీజన్‌లోనూ సినిమా, టెలివిజన్, సామాజిక మాధ్యమాలు సహా వివిధ రంగాలకు చెందిన వారిని హౌస్‌లోకి తీసుకొచ్చే బిగ్‌బాస్ నిర్వాహకులు ఈసారి ఎవరిని ఎంపిక చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. సాధనా నాయుడు నిజంగానే పదో సీజన్‌లో అడుగుపెడతారా? లేక ఆమె పేరు కూడా ఊహాగానాలకే పరిమితమవుతుందా? అన్నది అధికారిక ప్రకటనతోనే తేలనుంది.





# మరో విజయ్ మాల్యాలా మారిన ప్రేమ్ సాగర్ రావు

### మంచిర్యాల ఎమ్మెల్యే ఆస్తులపై విచారణ జరపాలి

### చెరువుల కబ్జాపై ‘హైడ్రా’ ఎందుకు మౌనంగా ఉంది?

### బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ఉద్యమ కెరటం, మంచిర్యాల: రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో ఆటవిక వాతావరణం నెలకొందని, మంచిర్యాల నియోజకవర్గంలో మాఫియా రాజ్యం నడుస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తీవ్రంగా ఆరోపించారు. శుక్రవారం ఆయన మంచిర్యాల జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తీరు మరో విజయ్ మాల్యా, నీరవ్ మోదీలను తలపిస్తోందని విమర్శించారు. ఎమ్మెల్యే అక్రమ ఆస్తులు, బ్యాంకు రుణాల వ్యవహారాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ , అవినీతి నిరోధక శాఖ, విజిలెన్స్ అధికారులు లోతైన విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. రూ. 470 కోట్ల లోన్ తీసుకున్న ఎమ్మెల్యే, కేవలం వారం వ్యవధిలోనే రూ. 190 కోట్లు ఎలా చెల్లించారో ప్రజలకు సమాధానం చెప్పాలని ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. నాన్ పర్ఫార్మింగ్ అసెట్స్ గా మారిన కంపెనీలకు బొంబాయికి చెందిన బెకాన్ కంపెనీ రూ. 140 కోట్లు ఎలా ఇచ్చిందో తేల్చాలన్నారు. కేవలం రూ. 10 లక్షల విలువ గల ‘ఊర్మిక’ కంపెనీకి రూ. 140 కోట్ల అప్పు ఏ ప్రాతిపదికన వచ్చిందో విచారించాలని కోరారు. పేద ప్రజలు బ్యాంకుల వద్దకు వెళ్తే సిబిల్ స్కోర్, ఆస్తుల షూరిటీలు అడుగుతూ వేధించే బ్యాంకులు, ఎమ్మెల్యే ఆస్తులను ఎందుకు జప్తు చేయడం లేదని ఆయన నిలదీశారు. మంచిర్యాలలో ఐటీ పార్కు పేరుతో పేదల భూములను గుంజుకుంటూ రియల్ ఎస్టేట్ దందాలు చేస్తున్నారని ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. గోదావరి తీరం నుండి అక్రమంగా ఇసుక, మట్టి రవాణా దందా బహిరంగంగా సాగుతున్నా జిల్లా కలెక్టర్, పోలీసులు, మైనింగ్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. చెరువులు కబ్జాకు గురవుతుంటే, జీవో 99 ప్రకారం ఏర్పాటైన ‘హైడ్రా’ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, పేదల ఇండ్లను మాత్రమే అన్యాయంగా కూల్చివేస్తున్నారని ధ్వజమెత్తారు. రూ. 2,000 లంచం తీసుకున్న చిన్న ఉద్యోగులను జైలుకు పంపించే అవినీతి నిరోధక శాఖ అధికారులు, నెలకు రూ. 2.5 లక్షల జీతం తీసుకుంటూ రోజుకు రూ. 2 కోట్లు అక్రమంగా సంపాదిస్తున్న ఎమ్మెల్యే ఆస్తులపై ఎందుకు విచారణ చేయడం లేదని ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకొని ఈడీ లోతైన విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ‘కొరియన్ కనకరాజు’కు అదిరిపోయే ఆరంభం

వరుణ్ తేజ్ హీరోగా నటించిన హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘కొరియన్ కనకరాజు’ బాక్సాఫీస్ వద్ద శుభారంభం చేసింది. వినూత్నమైన ప్రచారంతో విడుదలకు ముందే మంచి హైప్ సంపాదించుకున్న ఈ చిత్రం, ఇప్పుడు బలమైన అడ్వాన్స్ బుకింగ్స్, ప్రీమియర్ షోల నుంచి వచ్చిన మంచి టాక్‌తో మంచి వసూళ్ల దిశగా దూసుకెళతోంది. వరుస పరాజయాల తర్వాత వరుణ్ తేజ్ కెరీర్‌కు ఈ సినిమా విజయం అత్యంత కీలకంగా మారింది. సినిమాపై ప్రేక్షకుల్లో ఉన్న ఆసక్తికి అడ్వాన్స్ బుకింగ్స్ అద్దం పట్టాయి. ముఖ్యంగా చివరి 24 గంటల్లో టికెట్ల అమ్మకాలు భారీగా పెరిగాయి. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో మాత్రమే సుమారు 33 వేలకు పైగా టికెట్లు అమ్ముడవడం విశేషం. దీనికి తోడు విడుదలకు ముందు రోజు హైదరాబాద్ సహా పలు నగరాల్లో ఏర్పాటు చేసిన పెయిడ్ ప్రీమియర్ షోలకు అద్భుతమైన స్పందన లభించింది. చాలా షోలు హౌస్‌ఫుల్ కాగా, సినిమా చూసిన ప్రేక్షకులు సోషల్ మీడియా వేదికగా ప్రశంసలు కురిపిస్తున్నారు. ముఖ్యంగా వరుణ్ తేజ్ కామెడీ టైమింగ్, ఆయన నటన సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. సినిమాలోని కొన్ని కామెడీ సన్నివేశాలు థియేటర్లలో కడుపుబ్బా నవ్విస్తున్నాయని, హారర్‌తో కూడిన వినోదం బాగా వర్కౌట్ అయిందని పాజిటివ్ ఫీడ్‌బ్యాక్ వస్తోంది. ప్రమోషన్ల సమయంలో వరుణ్ తేజ్ వ్యక్తం చేసిన ధీమాకు తగ్గట్టుగానే సినిమా ఉందని ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద పెద్ద సినిమాల నుంచి గట్టి పోటీ లేకపోవడం కూడా ‘కొరియన్ కనకరాజు’కు కలిసొచ్చే అంశంగా ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ సానుకూల పరిస్థితుల్లో తొలి వారాంతంలో సినిమా భారీ వసూళ్లను నమోదు చేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. మొత్తంగా మంచి బజ్, పాజిటివ్ టాక్‌తో మొదలైన ‘కొరియన్ కనకరాజు’ వరుణ్ తేజ్‌కు చాలా కాలంగా ఎదురుచూస్తున్న విజయాన్ని అందిస్తుందో లేదో చూడాలి.




Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**